CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 | సంచిక : 55 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 1 నవంబర్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం.. ప్రధాని మోదీ హెచ్చరిక

- సర్దార్ పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం
- 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ శక్తి ఏంటో ప్రపంచానికి తెలిసిందన్న మోదీ
- గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను విస్మరించాయని విమర్శ
- దేశంలో నక్సలిజాన్ని చాలా వరకు నియంత్రించామని వెల్లడి
- చట్టవిరుద్ధ చొరబాటుదారులందరినీ ఏరివేస్తామని ప్రతిజ్ఞ



**హైదరాబాద్ పెన్ పవర్:**శత్రువులకు భారత్ ఇచ్చే సమాధానం ఇప్పుడు చాలా స్పష్టంగా, బలంగా, ప్రపంచానికి కనిపించేలా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుజరాత్‌లోని 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా శత్రు భూభాగంలోకి ప్రవేశించి మరీ దాడులు చేయగలమని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు."ఎవరైనా భారత్ వైపు కన్నెత్తి చూసే సాహసం చేస్తే, భారత్ వారి ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బకొడుతుందని 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచమంతా చూసింది. ఈ రోజు పాకిస్థాన్‌కు, ఉగ్రవాద నిర్వాహకులకు భారత్ అసలైన శక్తి ఏంటో బాగా తెలుసు" అని ప్రధాని అన్నారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వ దృఢ వైఖరి, సర్దార్ పటేల్ ఆశయాలకు అనుగుణంగానే ఉందని ఆయన పేర్కొన్నారు.జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా ప్రధాని కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పటేల్ ఆశయాలను పూర్తిగా మరిచిపోయిందని ఆరోపించారు. కేవలం బాహ్య శత్రువులకే

వివరాలు 2లో..

## ఆ సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

### జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి ప్రచారం



- కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా
- చనిపోతే పోటీలో నిలబెట్టవద్దనే సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కిందని విమర్శ
- పీజేఆర్ చనిపోతే బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టిందని ఆగ్రహం

వివరాలు 2లో..

## మొంథా తుపాను కారణంగా 12 జిల్లాల్లో తీవ్ర నష్టం

- పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలన్న ముఖ్యమంత్రి
- ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులుకోమన్న రేవంత్ రెడ్డి
- వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం






**హైదరాబాద్ పెన్ పవర్:**'మొంథా' తుపాను కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం హన్మకొండ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై సమగ్ర నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్ద ఉన్న సమాచారాన్ని కూడా కలెక్టర్లకు అందజేయాలని సూచించారు. అన్ని నివేదికలను క్రోడీకరించి నిర్దిష్ట నమూనాలో కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని ఆయన అన్నారు. తుపాను నష్టాల నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి కృషి చేయాలని, ఈ విషయంలో అధికారులు అలసత్వం వహించకూడదని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవడానికి

వివరాలు 2లో..



## అజారుద్దీన్ అనే నేను..

- మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్.. అల్లా పేరు మీద ప్రమాణం
- రాజ్‌భవన్‌లో అజారుద్దీన్ ప్రమాణం
- ప్రమాణస్వీకారం చేయించిన రాష్ట్ర గవర్నర్
- హాజరైన రేవంత్ రెడ్డి, మంత్రులు

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. అల్లా పేరు మీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో

వివరాలు 2లో..

## డీప్‌ఫేక్‌పై ఆందోళన వ్యక్తం చేసిన చిరంజీవి

- డీప్‌ఫేక్ టెక్నాలజీ పెద్ద గొడ్డలిపెట్టు అన్న చిరంజీవి
- తాను కూడా డీప్‌ఫేక్ బాధితుడినేనని వెల్లడి
- ఫిర్యాదు చేయగానే తెలంగాణ పోలీసులు వేగంగా స్పందించారని కితాబు



**హైదరాబాద్ పెన్ పవర్:**డీప్‌ఫేక్ టెక్నాలజీ సమాజానికి ఒక పెద్ద గొడ్డలిపెట్టుగా మారుతోందని మెగాస్టార్ చిరంజీవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాను కూడా డీప్‌ఫేక్ బారిన పడ్డానని, కొం దరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలు సృష్టించారని ఆయన వెల్లడించారు. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు తక్షణమే ప్రత్యేక చట్టాలు

వివరాలు 2లో..

## అమెరికా-భారత్ మధ్య కీలక రక్షణ ఒప్పందం

- ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం
- పదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం చేసిన ఇరుదేశాలు
- రాజ్‌నాథ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్న అమెరికా రక్షణ మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది.ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## ఆయుర్వేద దగ్గు మందుతో 5 నెలల చిన్నారి మృతి

- మధ్యప్రదేశ్‌లో కలకలం
- ఆయుర్వేద సిరప్ వాడిన కొద్ది గంటల్లోనే విషమించిన ఆరోగ్యం
- సంబంధిత మెడికల్ షాపును సీల్ చేసిన అధికారులు
- సిరప్ నమూనాలను ల్యాబ్‌కు పంపిన ఆరోగ్య శాఖ
- ఇటీవలే 24 మంది చిన్నారులు మరణించిన ఘటన మరవకముందే ఈ దారుణం
- చిన్నారుల మందుల అమ్మకాలపై మరోసారి భద్రతా ప్రశ్నలు



వివరాలు 2లో..

## ప్రధాని మోదీ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు

- తమిళనాడులో బీహారీ కార్మికులను డీఎంకే వేధిస్తోందన్న మోదీ
- ప్రధాని వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన సీఎం స్టాలిన్
- రాష్ట్రాల మధ్య విరోధం సృష్టించే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు




**హైదరాబాద్ పెన్ పవర్:**:తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం బీహార్ వలస కార్మికులను వేధిస్తోం దంటూ ప్రధాని మోదీ చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

వివరాలు 2లో..

## సీనియర్లకు కీలక పదవులు.. సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌కు కేబినెట్ హోదా

- తెలంగాణ సర్కార్ కీలక నియామకాలు
- ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనాప రంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీలోని ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదాతో కూడిన ముఖ్యమైన పదవులను కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. రామకృష్ణరావు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.వివరాల్లోకి వెళితే, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు (గవర్నమెంట్ అడ్వైజర్)గా నియమించారు. అదేవిధంగా, మంచిర్యాల ఎమ్మెల్యే కె. ప్రేమ్‌సాగర్ రావుకు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ (సివిల్ సప్లైస్ కార్పొరేషన్) చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు పదవులకు కేబినెట్ హోదా

వివరాలు 2లో..

## తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ.. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలాంబర్తి




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీ జరిగింది. 8 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు శుక్రవారం (అక్టోబర్ 31) ఉత్తర్వులు జారీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా సభ్యసాచి ఘోష్, గురుకుల సంక్షేమ కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలాంబర్తిని నియమించిన ప్రభుత్వం పశు సంవర్ధకశాఖ కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది.

వివరాలు 2లో..

## వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

### భౌతికంగా హాజరుకావాల్సిందేనని ఆదేశం



- నవంబర్ 3న భౌతికంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు
- వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తి తిరస్కరణ
- కోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదన్న ధర్మాసనం
- కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర అసహనం
- పశ్చిమ బెంగాల్, తెలంగాణ సీఎస్‌లకు మాత్రం మినహాయింపు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మన ఎమ్మెల్సీలు ఏం చేస్తున్నారు..
# జగన్ ఆరా.. రీజనిన్ ఇదే...!

ఇప్పటి వరకు లేని విధంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజాగా ఎమ్మెల్సీల గురించి ఆరా తీసి నట్టు తెలిసింది. "మనోళ్లు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు?" అని కీలక మాజీ సలహాదారు ను అడిగి తెలుసుకున్నట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందింది. అంతేకాదు.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీల పనితీరును కూడా తెలుసుకున్నట్టు తెలిసింది. వారు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు ? అనే విషయాలపై కీలక నేత నుంచి సమాచారం తెప్పించుకున్నారని అంటున్నారు.

**ఎందుకు..?**

నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల గురించి మాత్రమే జగన్ అడపా దడపా ప్రశ్నించేవారు. అంతకు మించి ఎమ్మెల్సీలపై ఆయన ఎప్పుడు దృష్టి పెట్టింది లేదు. వారు ఎక్కడున్నా.. ఏం చేస్తున్నా కూడా.. పెద్దగా స్పందించేవారు కాదు. ఈ క్రమంలోనే పలువురు ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కొందరు అధికార పార్టీ టీడీపీలో చేరగా.. మరికొందరు ఇతర పార్టీలో చేరారు. అయినప్పటికీ.. జగన్ వారి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కనీసం వారికి సంబంధించి అంశాలపై ఎప్పుడూ మాట్లాడలేదు. కానీ. తొలిసారి.. ఎమ్మెల్సీల విషయాన్ని జగన్ ప్రస్తావించడం.. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీలు ఏం చేస్తున్నారంటూ.. ఆరా తీయడం వంటివి ఆసక్తిగా మారింది. దీనికి ప్రధాన కారణం.. మండలిలో వైసీపీ బలాన్ని తగ్గించే విధంగా రాజకీయ వ్యూహాలు తెరమీదికి వస్తున్నాయని కొన్నాళ్లుగా చర్చ సాగుతోంది. వైసీపీ ప్రస్తుతం మండలిలో పైచేయిగా ఉంది. ప్రభుత్వానికి ఇక్కడే ఇబ్బంది వస్తున్న విషయం తెలిసిందే. టీడీపీ నేత చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే బిల్లుకు కూడా ఇక్కడే అడ్డుకట్ట పడింది. అలానే.. ఇతర అంశాలపై కూడా వైసీపీ ఇక్కడే పోరాటం చేస్తోంది. దీంతో భవిష్యత్తులో తీసుకువచ్చే పలు బిల్లులకు వైసీపీ అడ్డు కట్ట వేయకుండా.. మండలిలో పైచేయి సాధించాలన్నది టీడీపీ వ్యూహం. రాజకీయంగా ఇలాంటివి కామనే. అయితే.. ప్రస్తుతం అసెంబ్లీలో ఎలానూ బలం లేనందున.. మండలిలో కూడా బలం పోతే.. ఇక, వైసీపీకి గుర్తింపు పెద్దగా ఉండదు. ఈ నేపథ్యంలోనే.. జగన్.. తమ ఎమ్మెల్సీల విషయాన్ని ఆరా తీశారని.. తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. అయితే.. పార్టీ నుంచి బయటకు వచ్చే వారిని ఆపని సంస్కృతి కొనసాగుతున్న వైసీపీలో ఇప్పుడు ఇలా చర్చించడం.. ఆరా తీయడం ఆసక్తిగా మారింది.

# ఆయుర్వేద దగ్గు మందుతో 5 నెలల చిన్నారి మృతి

మధ్యప్రదేశ్‌లో దగ్గు మందుల మరణాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల నకిలీ సిరప్‌లతో 24 మంది చిన్నారులు మరణించిన ఘటన మరవకముందే, ఇప్పుడు ఓ ఆయుర్వేద దగ్గు మందు 5 నెలల శిశువు ప్రాణాలను బలిగొంది. చింధ్వాడా జిల్లాలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అధికారులు వెంటనే స్పందించి, మందు అమ్మిన దుకాణాన్ని మూసివేశారు.

**అసలేం జరిగింది?**

చింధ్వాడా జిల్లా బిచ్వా గ్రామానికి చెందిన సందీప్ మినోట్ కుమార్తె 5 నెలల రూహీకి దగ్గు, జలుబు చేసింది. దీంతో వారు అక్టోబర్ 27న స్థానికంగా ఉన్న ఆక్సిజన్ మెడికల్ స్టోర్‌లో ఓ ఆయుర్వేద దగ్గు సిరప్‌ను కొనుగోలు చేశారు. దుకాణదారుడి సలహా మేరకు పాపకు ఆ మందు పట్టించారు. అయితే, కొద్ది గంటల్లోనే చిన్నారి ఆరోగ్యం విషమించింది. "పాపకు శ్వాస ఆడలేదు, వెంటనే ఊపిరి ఆగిపోయింది" అని తండ్రి సందీప్ కన్నీటిపర్యంతమయ్యారు.వెంటనే పాపను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, తెల్లవారుజామున 4:30 గంటలకు శిశువు అప్పటికే మరణించిందని వైద్యులు ధృవీకరించారు.

**అధికారుల చర్యలు**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. సిరప్ అమ్మిన మెడికల్ స్టోర్‌ను సీల్ చేసి, మిగిలిన స్టాక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిరప్ నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ల్యాబొరేటరీకి పంపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బిచ్వా పోలీసులు కేసు నమోదు చేశారు. "జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నేతృత్వంలో దర్యాప్తు జరుగుతోంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చాకే మరణానికి కచ్చితమైన కారణం తెలుస్తుంది" అని జిల్లా కలెక్టర్ హరేంద్ర నారాయణ్ తెలిపారు.ఏడాది లోపు పిల్లలకు వైద్యుని సిఫార్సు లేకుండా దగ్గు మందులు అమ్మకూడదన్న నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద ఈ కేసును విచారిస్తున్నారు.

**వీడని విషాదాలు**

కొన్ని వారాల క్రితమే బేతూల్, చింధ్వాడా జిల్లాల్లో 'కోల్డ్రిఫ్' అనే నకిలీ దగ్గు మందు కారణంగా 24 మంది చిన్నారులు మరణించారు. ఇప్పుడు ఆయుర్వేద సిరప్ సైతం అనుమానాల నీడలోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మధ్యప్రదేశ్‌లో వరుసగా చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు దేశంలో ఔషధాల నాణ్యత, నియంత్రణ వ్యవస్థలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

# అజారుద్దీన్ అనే నేను..

- మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర కేబినెట్ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా మధ్యాహ్నం 12:25 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం 9 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం. మరోవైపు, అజారుద్దీన్ కు ఏ శాఖ కేటాయిస్తారనే విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఆ సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో పోటీ పెట్టకూడదనే సంప్రదాయాన్ని బీఆర్ఎస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. గతంలో పీజేఆర్ మరణించినప్పుడు బీఆర్ఎస్ దుర్మార్గంగా వారి అభ్యర్థిని నిలబెట్టిందని మండిపడ్డారు. నగరానికి గోదావరి నీళు తెచ్చిన ఘనత పీజేఆర్‌దేనని కొనియాడారు. అలాంటి పీజేఆర్‌పై పోటీకి దింపిన బీఆర్ఎస్‌కు సానుభూతి ఓట్లు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కూడా సెంటిమెంట్‌ను నమ్ముకున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా ఈ ప్రాంతానికి వచ్చారా అని నిలదీశారు. ఓట్ల కోసం బీఆర్ఎస్ నాయకులు వస్తే వారికి వాతలు పెట్టాలని ఓటర్లకు సూచించారు. నవీన్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని హామీ ఇచ్చారు.

# వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళ్లు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే.

ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశువైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఏబీసీ నిబంధనలు దేశమంతటా ఒకేలా ద వర్తిస్తాయని పేర్కొంటూ రాష్ట్రాలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వల్ల చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన మీడియా కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు జూలై 28న ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది.

# డీప్‌ఫేక్‌పై ఆందోళన వ్యక్తం చేసిన చిరంజీవి

- మొదటి పేజి తరువాయి

తీసుకురావాలని, లేకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా తెలంగాణ పోలీసులు ఈరోజు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి.. డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనర్‌తో కలిసి 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, డీప్‌ఫేక్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. "డీప్‌ఫేక్ అనేది చాలా ప్రమాదకరమైనది. నా ఫొటోలను మార్ఫింగ్ చేసిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారు. డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ సజ్జనార్ ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఈ కేసును సీపీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ పోలీసు వ్యవస్థ చాలా బలంగా ఉంది. ప్రజలకు వారు అండగా నిలుస్తున్నారు" అని చిరంజీవి తెలిపారు.

పెరుగుతున్న టెక్నాలజీని ఆహ్వానించాలని, అయితే దానితో పాటు వచ్చే ముప్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "డీప్‌ఫేక్, సైబర్ నేరాలకు ఎవరూ భయపడాల్సిన పనిలేదు. ధైర్యంగా పోలీసులను ఆశ్రయించండి. ప్రభుత్వాలు ఈ సమస్యపై దృష్టి సారించి కఠినమైన చట్టాలు రూపొందించాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు మాట్లాడుతూ, 560 సంస్థానాలను ఏకం చేసి దేశానికి 'వన్ నేషన్' అనే గొప్ప వరాన్ని అందించిన మహనీయుడు సర్దార్ పటేల్ అని చిరంజీవి కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, దార్శనికత అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రధాని మోదీ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ప్రధాని తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ ఘాటుగా బదులిచ్చారు.

బీహార్‌లో జరిగిన ఓ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో పనిచేస్తున్న బీహారీ కార్మికులను డీఎంకే ప్రభుత్వం అవమానిస్తోందని, వారిపై వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ప్రధాని వ్యాఖ్యలను ఖండిస్తూ సీఎం స్టాలిన్ 'ఎక్స్' వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. "ఒక తమిళుడిగా ప్రధాని మోదీని నేను వినయంగా కోరుతున్నాను. ఆయన దేశ ప్రజలందరికీ ప్రధాని అనే గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారనే విషయాన్ని తరచుగా మర్చిపోతున్నారేమో అని బాధగా ఉంది. ఇలాంటి ప్రకటనలతో తన పదవికి ఉన్న గౌరవాన్ని కోల్పోవద్దు" అని స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీ సభ్యులు కేవలం ఎన్నికల రాజకీయాల కోసం ఒడిశా, బీహార్ అంటూ తమిళులపై తమ ద్వేషాన్ని ప్రదర్శిస్తున్నారని, ఒక ముఖ్యమంత్రిగా ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

హిందువులు, ముస్లింల మధ్య శత్రుత్వం పెంచినట్లే, ఇప్పుడు తమిళులు, బీహార్ ప్రజల మధ్య విరోధం సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని స్టాలిన్ విమర్శించారు. "ఇటువంటి చిల్లర రాజకీయ పద్ధతులు మానుకుని, దయచేసి దేశ సంక్షేమంపై దృష్టి పెట్టండి" అని ప్రధానికి, బీజేపీ నేతలకు ఆయన హితవు పలికారు. ప్రధాని వ్యాఖ్యలతో దక్షిణాది రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి

# తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ.. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలాంబర్తి

- మొదటి పేజి తరువాయి

జీఏడీ పొలిటికల్ ఇంచార్జి సెక్రటరీగా .శ్రీధర్, ఆయిల్ ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషా నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా జి. జితేందర్ రెడ్డి నియామకం కాగా ఆయనకు ఎస్సీ సహకార సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు కల్పించారు. మెట్రో పాలిటన్ అర్బన్ డెవలప్మెంట్ కార్యదర్శి బాధ్యతలను సీఎస్ రామకృష్ణ రావు తన వద్దే ఉంచుకున్నారు.

# సీనియర్లకు కీలక పదవులు.. సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్‌కు కేబినెట్ హోదా

- మొదటి పేజి తరువాయి

కల్పించడం గమనార్హం. కొంతకాలంగా మంత్రివర్గంలో చోటు కోసం ఈ ఇద్దరు సీనియర్ నేతలు ఎదురుచూస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, వారిని సంతృప్తిపరిచేందుకే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి అనుభవాన్ని ప్రభుత్వానికి ఉపయోగించుకోవడంతో పాటు, పార్టీలో వారికి సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నియామకాలు చేపట్టినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తాజా ఉత్తర్వులతో ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లయింది.

# మొంథా తుపాను కారణంగా 12 జిల్లాల్లో తీవ్ర నష్టం

- మొదటి పేజి తరువాయి

వెనుకాడబో మని హెచ్చరించారు. తెలంగాణ ధనిక రాష్ట్రమైనప్పటికీ, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వదులుకునే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.

వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5 లక్షల పరిహారం అందజేస్తుందని ప్రకటించారు. ఇళ్లు నీట మునిగిన బాధితులకు రూ. 15 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గుడిసెలు కోల్పోయిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద గృహాలు మంజూరు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎకరా పంట నష్టానికి రూ. 10 వేలు, ఆవులు, గేదెలు మరణిస్తే రూ. 50 వేలు, మేకలు, గొర్రెలు మరణిస్తే రూ. 5 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# శత్రువుల ఇంట్లోకి చొరబడి మరీ కొడతాం.. ప్రధాని మోదీ హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

కాకుండా నక్సలిజం, చొరబాట్లు వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కోవడంలో కూడా తమ ప్రభుత్వానికి పటేల్ ఆదర్శాలే మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. "2014కు ముందు దేశంలోని అనేక ప్రాంతాల్లో నక్సలైట్లు సమాంతర పాలన సాగించారు. పాఠశాలలు, ఆసుపత్రులను పేల్చివేస్తుంటే, నాటి ప్రభుత్వాలు నిస్సహాయంగా చూశాయి. మేము అర్బన్ నక్సల్స్‌పై కఠినంగా వ్యవహరించాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. గతంలో 125 జిల్లాల్లో ఉన్న నక్సల్స్ ప్రభావం ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైంది" అని మోదీ వివరించారు.

చొరబాట్లు దేశ ఐక్యతకు పెను ముప్పుగా పరిణమించాయని ప్రధాని హెచ్చరించారు. "గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుల కోసం దేశ భద్రతను పణంగా పెట్టాయి. దేశం బలహీనపడినా చొరబాటుదారుల కోసం పోరాడేవారు పట్టించుకోరు. కానీ దేశ భద్రత, గుర్తింపు ప్రమాదంలో పడితే ప్రతి పౌరుడూ ప్రమాదంలో పడినట్లే. అందుకే, చట్టవిరుద్ధంగా నివసిస్తున్న ప్రతి చొరబాటుదారుడిని దేశం నుంచి తొలగించాలని మనం సంకల్పించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వం అనే పటేల్ సందేశాన్ని గుర్తుచేస్తూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు. "ఐక్య భారతదేశంలో విభిన్న ఆలోచనలను గౌరవించాలి. అభిప్రాయ భేదాలు ఉండొచ్చు, కానీ హృదయాల్లో భేదాలు ఉండకూడదు" అని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ 182 మీటర్ల ఎత్తైన పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, హాజరైన వారితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. 2014 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

# స్వదేశీ వస్తువులే ముద్దు విదేశీ వస్తువులు వద్దు






- రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పిలుపు
- జూనియర్ కళాశాల అభివృద్ధికి కంబాల లక్ష రూపాయలు విరాళం

**గోకవరం, పెన్ పవర్,అక్టోబర్ 31:** దేశ ఆర్థిక అభివృద్ధికి ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులనే వాడాలని, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ అనే కార్యక్రమం గురించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరగా, స్పందించిన కంబాల లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన స్వదేశీ వస్తువులను వినియోగించి దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలన్నారు. విదేశీ వస్తువులు వాడటం వల్ల ఆయా దేశాల అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సాఫ్ట్ డ్రిక్స్ తాగడం మానుకోవాలని అందులో విషపూరిత పదార్థాలు ఉన్నాయని అన్నారు. మజ్జిగ, కొబ్బరి నీళ్ళు తాగడం అలవాటు చేసుకోవాలని, ఇది ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని సూచించారు. స్వదేశీ వస్తువులు వాడకం ద్వారా స్థానికంగా ఉండే వ్యాపారస్తులు కార్మికులు, పరిశ్రమలు అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. విద్యార్థులు ప్రతిరోజు సరి కొత్తగా ఆలోచించే విధానాన్ని అవలంబించుకోవాలని తద్వారా మానసిక వికాసం, ఆత్మస్థైర్యం పెంపొందించుకోవచ్చు అన్నారు. నిన్న మనం ఏంటి, ఈ రోజు ఏంటి, రేపు మనం ఎలా ఉండాలి అని ఆలోచిస్తూ మన ఎదుగుదలను ఎప్పటికప్పుడు అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ వాటి ఉపయోగాలను తెలియజేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. పదోవ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐదోవ స్థానంలోకి తీసుకు వచ్చి, మూడోవ స్థానానికి పరుగులు పెట్టిస్తున్నారని కంబాల వివరించారు. ఈ రోజు మన దేశ రక్షణ వ్యవస్థ ప్రతిష్టాత్మకంగా ఉందంటే నరేంద్ర మోడీయే కారణమన్నారు. ఆయన పాలనలో మన దేశం సురక్షితంగా ఉందన్నారు. అనంతరం ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ స్టిక్కర్లు పంపిణీ చేశారు. అనంతరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం నుంచి దేవిచౌక్ వరకు స్వదేశీ వస్తువులనే వాడాలనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు ,రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, పెద్దాడ వెంకన్న దొర, పసల గణేష్, దేశాల నరేష్, నాగ రమేష్, దోసపాటి సుబ్బారావు, మండే గౌతమ్, తటికొండ సురేష్, మణికంఠ, మళ్ల అధిశేషు, గని రాజు, దుర్గారావు, మందపాటి సతీష్, నందూరి దుర్గారావు, పలకం శెట్టి శ్రీను, కేబుల్ రాజు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం





- అమలాపురం ఏరియా హాస్పిటల్ -సహృదయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో
- రక్తదానం చేసిన కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీరా.

**రావులపాలెం,పెన్ పవర్ అక్టోబర్ 31:**పోలీస్ అమరవీరుల సంస్మరణ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రావులపాలెం మల్లిడి కనికి రెడ్డి కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని అమలాపురం ఏరియా హాస్పిటల్, సహృదయ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేయగా, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, సేవా సంస్థ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం పట్టణ సీఐ ఎం.శేఖర్ బాబు, రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్ హాజరయ్యారు.రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందిని, యువతను ఎస్పీ రాహుల్ మీనా ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ

"పోలీసు అమరవీరులు ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించారు. వారి త్యాగం మనందరికీ ఆదర్శం. రక్తదానం మనిషి చేయగలిగే అత్యుత్తమ సేవలలో ఒకటి. ఈ సేవలో పాల్గొనడం ద్వారా అమరవీరుల త్యాగానికి నిజమైన నివాళి అర్పించినట్టే అవుతుంది" అన్నారు.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ

"ప్రజల రక్షణ కోసం కష్టపడే పోలీసు సిబ్బంది దేశానికి వెన్నెముక లాంటివారు. వారిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని" పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది, సచివాలయం మహిళా పోలీసులు, స్థానిక యువత, సేవా సంస్థ సభ్యులు రక్తదానంలో పాల్గొన్నారు. మొత్తం 200వందల యూనిట్లు రక్తాన్ని సేకరించామని సహృదయ బ్లడ్ బ్యాంక్ వారు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపుగా సర్టిఫికెట్లు అందజేశారు.

సహృదయ ఫౌండేషన్ ప్రతినిది పైడ రాజేష్ మాట్లాడుతూ

"రక్తదానం ద్వారా ఎన్నో ప్రాణాలు రక్షించవచ్చు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం అని తెలిపారు.ఇంత దిగ్విజయంగా జరగడానికి సహాయపడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన రావులపాలెం పట్టణం సీఐ ఎం శేఖర్ బాబు వారి సిబ్బంది.






# తుఫాను బాధితులకు బియ్యం, నిత్యవసరాలు పంపిణీ.

**తుఫాను బాధితులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది.**

**ఆర్డిఓ అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం.**






**కె గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 31:** ప్రకృతి విపత్తు సమయాలలో బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రామచంద్రపురం ఆర్డీవో అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు పేర్కొన్నారు. మొ%శీ%తా తుఫాన్ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధితులకు ఆర్డీవో అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు శుక్రవారం బియ్యం, నిత్యాసర వస్తువులు పంపిణీ చేశారు.కె గంగవరం మండలంలోని దంగేరు, కోటిపల్లి గ్రామాల్లోని తుఫాను బాధితులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. బాధితులకు 25 కేజీల బియ్యం, మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50 కేజీలు చొప్పున, అలాగే కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ పంచదార తదితర నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో అఖిల మాట్లాడుతూ తుఫాను పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం బియ్యం,నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించింది అన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తుఫాను వల్ల ఉపాధి కోల్పోయి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారిని ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథంతో ఆలోచించి పేదలు ఇబ్బందులు పడకుండా బియ్యం, నిత్యవసరాలు పంపిణీకు ఆదేశించారన్నారు. సీఎం చంద్రబాబు అప్రమత్తత, అనుభవంతో తుఫాను వల్ల ఆస్తి, ప్రాణనాష్టం జరగకుండా కాపాడారని ప్రశంసించారు. అలాగే నియోజవర్గంలో తుఫాను కారణంగా నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషి చేస్తున్నారని, పంట నష్టం వివరాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను),ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,కె గంగవరం తాసిల్దార్ శ్రీరామ్, కే గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛభారత్ డైరెక్టర్ సలాది రమేష్,కోటిపల్లి సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు,కర్రి చిట్టిబాబు,మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ఓలేటి సుబ్రహ్మణ్యం, ఆయా గ్రామాల సర్పంచులు,పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం - నిత్యావసర వస్తువుల పంపిణీ

- ఆత్రేయపురం పునరావాస కేంద్రంలో ఎమ్మెల్యే బండారు సత్యానందం రావు పంపిణీ







**ఆత్రేయపురం, పెన్ పవర్ అక్టోబర్ 31:**మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లను కోల్పోయి పునరావాస కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలకు ఆర్థిక సహాయం నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం ఈరోజు ఆత్రేయపురం మండలం ఆత్రేయపురం గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందంరావు, ప్రధాన అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సహాయాన్ని అందజేశారు.మొత్తం 16 మంది తుఫాన్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంగా ప్రతి కుటుంబానికి ఒకరు ఉంటే 1000, అంతకంటే ఎక్కువ కుటుంబ సభ్యులు ఉంటే 3000 చొప్పున నగదు సాయం చేశారు. అదనంగా, ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల కిట్‌లో 25 కిలోల బియ్యం, 1 కిలో కంది పప్పు, 1 కిలో పంచదార, 1 లీటర్ ఆయిల్, 1 కిలో బంగాళాదుంపలు, 1 కిలో ఉల్లిపాయలు అందజేశారు.

అదేవిధంగా, 76 మంది మత్యకార కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, 1 కిలో కంది పప్పు, 1 కిలో పంచదార, 1 లీటర్ ఆయిల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందం మాట్లాడుతూ

"మొందా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉంది. పంట నష్టం గానీ, ఇల్లు కోల్పోవడం గానీ జరిగిన వారందరికీ సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలు త్వరలోనే సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి" అన్నారు.

ఈ కార్యక్రమంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి. శ్రీకర్, వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట రాజు, గ్రామ సర్పంచ్ గెడ్డం సుధారాజు, తహశీల్దార్ టి. రాజేశ్వరరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ యం. భాను, గ్రామ రెవెన్యూ అధికారులు, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

# చిర్రి చారిటబుల్ ట్రస్ట్ సహాయం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 31 :** పాకల గూడెం గ్రామానికి చెందిన తెల్లం స్వాతి అనే మహిళ భర్తను కోల్పోయి ,ముగ్గురు చిన్నారుల బాధ్యతలను మోస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్న పరిస్థితి తెలుసుకుని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించారు. శుక్రవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిర్రి చారిటబుల్ ట్రస్ట్ నుండి తెల్లం స్వాతికి 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిర్రీ చారిటబుల్ ట్రస్టు పోలవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు అనేక పేద కుటుంబాలకు, విద్యార్థులకు, రోగులకు, వృద్ధులకు అండగా నిలుస్తూ మానవత సేవలకు మారుపేరుగా మారిందని అన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు వ్యక్తిగతంగా కూడా తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారిని తన సొంత కుటుంబ సభ్యుల ఆదరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు అందరికీ ఆదర్శం అని పలువురు ప్రశంసించారు.

# జీలుగుమిల్లిలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 31 :** దేశ సమైక్యతకు ప్రతికిగా నిలిచిన ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ఆదర్శమని ఎస్సై వి క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి జగదంబ సెంటర్ వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశ సమైక్యత దేశ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి కేంద్ర హెూం శాఖ మంత్రిగా వల్లభాయ్ పటేల్ చొరవతో కొన్ని సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# టెండర్లు లేకుండానే పనులు

**మెదక్, అక్టోబరు 31 పెన్ పవర్:** అన్ని విషయాలు అధికారులకు తెలిసిన అక్కడ ఏమి జరగట్లేదు అంత నిజాయితీగానే జరుగుతుంది అన్నట్టు వ్యవహరి స్తున్నారు. చిన్న కరెంటు మీటర్ నుంచి విద్యుత్ కనెక్షన్ కావాలనుకున్న నిబంధనల కంటేఎక్కువ మామూళ్ళు ముట్ట చెప్పాల్సిం దే. ట్రాన్స్ఫార్మర్, ప్రభుత్వ కార్యాలయాలు, అనధికార వెంచర్లు.రైస్ మిల్లులు విషయానికి వస్తే ఈ అంచనాలు అంకెలు అధికారు లు కాంట్రాక్టర్లు కలిసి ఎంత చెబితే గంతేఅంటున్నారు విద్యుత్ వినియోగదారులను నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం అటువైపు చూడడమే మానేసింది.ఈ అంశాలను పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకుం టూ జిల్లాలో కాంట్రాక్టర్ లతో అధికారులకుమ్మక్కుఅనే శీర్షిక గురువారం నాడు వెలువడింది పాఠకులకు తెలిసిందే ముఖ్యంగా విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మ క్కు సంఘటన లో భాగంగానే ప్రధానంగా జిల్లా కేంద్రంలో డిఈ కనుసన్నల్లో పనులు

కాంట్రాక్టర్ల దగ్గర పర్సెంటేజి తీసుకొని పనులు అప్పచెప్పి సొమ్ముచేసు కుంటున్నట్లు కొంత మంది సహచర కాంట్రాక్టర్ లు చెబుతున్న మాట .కాంట్రాక్టర్ లతో దావత్ పేరిట విందులు, వినోదాల తో పాటు కమీషన్

తీసుకొని ప నులు చేస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా పేట జిల్లా కేంద్రంలో చేనేత భవనానికి ఎలాంటి టెండర్లు స్వీకరించకుండానే కమీషన్ తీసుకొని ఒకే కుటుం బానికి చెందిన ముగ్గురుఅన్నదమ్ముల్లో ఒక్కరికే పనులు అప్పగించడం వెనుక ఉన్న అంతరిమేమిటో అధికారులు చెప్పాలి . ఇదిలా ఉండగా మద్దూరు, కోస్గి మండలాలకు చెందిన కాంట్రాక్టర్లుకు పనులు అప్పచె ప్పటం పరిపాటిగా మారింది. ఏదిఏమైనా సరే నాకు మామూళ్ళు వస్తున్నాయా..? లేదా?అన్నది ఆయనకు ఆయనే పొరపాటుగా మారినట్లు తెలుస్తుంది. మక్తల్ నియోజకవర్గంలో విద్యుత్ పనుల విషయంలో సంబంధిత అధికారులపై ఓ హైదరాబాద్కాంట్రాక్టర్ ఆర్టీఐ కింద సమాచారం ఇవ్వమని దరఖాస్తు చేయగా సమాచారం ఇవ్వకపోగా ఆ విషయమై డి ఇ స్వయంగా తన వాహనంలో సంబంధిత ఏఈ లు, ఏ డి లను వెంట తీసుకుని వెళ్లి ఆ కాంట్రాక్టర్ తోపరిష్కారం చేసుకొన్నట్లు బహిరంగంగా ఇతర కాంట్రాక్టర్ లు చర్చించుకుంటున్నారు.మరి ఇంత బహిరంగంగా ప్రభుత్వానికి ఆదాయం రాకుండా అటువంటి వినియోగదారులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు. కాసులుకురిపిస్తున్న అనధికార వెంచర్లు ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ శాఖ అధికారి తన జేబుల్లోకి వేసుకొంటుంటే మరి జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా సూపరింటెండెంట్ అధికారికి తెలియకుండా పనులు ఎలా చేస్తారని మిగతా కాంట్రాక్టర్లుచర్చించుకుంటున్నారుఏది ఏమైనా ఇంతవిద్యుత్ శాఖలో ఇన్ని అక్రమాలు చోటు చేసుకుంటుంటే చోద్యం చూస్తున్నారా అని విమర్శ లు సైతం ఉన్నాయి. విద్యుత్ వినియోగదారులు ఏమైపోయినా పర్వాలేదు సంబంధితఅధికారులు మాత్రం కాంట్రాక్టర్లు బాగుపడితే చాలు అన్నట్టుఉంది .నారాయణపేట జిల్లాలో విద్యుత్ అధికారుల తీరు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఈ అంశంపై వినియోగదారులు సైతం తీవ్ర నిరాశకు గురి అవుతున్నప్పటికీ వారిని ఓదార్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాం గం నియమ నిబంధనలను అమలు చేస్తూ అడుగులు వేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారులు చెబుతున్నమాట. కాంట్రాక్టర్ల కు ఎవరికి ఏ రకమైనటువంటి పని కావలసి ఉన్న ఆ పనికి సంబం ధించి టెండర్ వేయవలసి ఉంటుంది. ఈ శాఖలో ఆ నిబంధనలు ఏం చెల్లవు. పోస్టల్ డిపార్ట్మెంట్ పోస్టులో డీటెయిల్ రాకుండా అన్నిఅక్కడే కార్యాలయంలో కార్యక్రమం అంతా పూర్తి చేసినప్పటికీ అక్కడే పోస్టల్ నుంచి వచ్చినట్టు టెండర్లు తీస్తారు నచ్చిన వారికి ఇస్తారు.. అంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది ఇక్కడ ఎవరికి ఏ పని కావాలో ఉన్నతఅధికారులు మాత్రమే నిర్ణయిస్తారు. ప్రజాప్రతినిధులు సైతం ఇందుకు మద్దతు పలుకుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ విధానానికి ఇచ్చేవరకు నియమ నిబంధనలకు స్వాగతం పలకాలని కాంట్రాక్టర్లతోపాటువినియోగదారులు ఆసక్తి కనపరుచుతున్నారు. ఇంత బహిరంగంగా ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పనులు చేస్తుంటే విజిలెన్స్ అధికారులు నిద్ర పోతున్నారా అనే విమర్శలు సైతం ఉన్నాయి ఇకనైనా అనధికారటెండర్ల పనులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జనవరి నుంచి అందుబాటులోకి టిమ్స్

**హైదరాబాద్, అక్టోబరు 31,పెన్ పవర్:** రాష్ట్ర ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఫ్రీగా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్ జిల్లాలో చెరొకటి చొప్పున రెండు భారీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే.అవే టిమ్స్. సనత్ నగర్‌లో సుమారు పదుల ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తోన్న ఈ ఆస్పత్రి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి రానుంది. ఇప్పటికే దీని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరి ఈఆస్పత్రిలోని ప్రత్యేకతలు, వీటికి కేటాయించిన బడ్జెట్ వంటి వివరాలు..తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వారు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సేవల కోసం గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల మీదనే ఎక్కువగాఆధారపడుతున్నారు. దీంతో ఈ రెండు ఆస్పత్రుల మీద భారం అధికం అయ్యింది. పైగా పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా ఇవి సరిపోవు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మరి కొన్ని ప్రాంతాల్లో భారీ స్థాయిలో ప్రభుత్వఆస్పత్రుల నిర్మాణం చేపట్టాలని భావించింది. దీనిలో భాగంగా వరంగల్ , హైదరాబాద్ నగరంలోని సనత్ నగర ప్రాంతాల్లో తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) పేరిట ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణంప్రారంభించింది. వీటిల్లో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించనున్నారు. ఈక్రమంలో ఈ రెండు ఆస్పత్రులకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది.సనత్‌నగర్‌లో నిర్మిస్తోన్న టిమ్స్ ఆసుపత్రి ఈ సంవత్సరంలోనేఅందుబాటులోకి రానుంది. కార్పొరేట్ హంగులతో ఈ ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్న నేపథ్యంలో డిసెంబర్ 9న ఈ ఆస్పత్రిని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఆలోపు సాధ్యం కాకపోతే.. డిసెంబర్ 31 నాటికి దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీంతో ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు 58 ఎకరాల విస్తీర్ణంలో..రూ.1,100 కోట్ల ఖర్చుతో.. 11.68 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో.. జీ5 అంతస్తుల భవన సముదాయంగా సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణం సాగుతోంది. దీనిలో 1000 పడకలు, 30 విభాగాల్లో పేదలకుకార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించనున్నారు.ఈ సంవత్సరం డిసెంబర్ 31 కల్లా వరంగల్ నిర్మిస్తోన్న టిమ్స్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం బలంగా నిర్ణయించుకుంది. ఆ మేరకు నిర్మాణపనులు వేగవంతం చేసింది. ఈ రెండు ఆస్పత్రులు ప్రారంభించిన తర్వాత.. వచ్చే సంవత్సరం అనగా 2026, మార్చిలో.. అల్వాల్, అలానే జూన్‌లో.. ఎల్బీనగర్, వచ్చే ఏడాది డిసెంబర్‌లో.. నిమ్స్ హాస్పిటల్ బిల్డింగ్ పనులు పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆస్పత్రులు ప్రారంభమైతే రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. నిరుపేద కుటుంబాలు ఫ్రీగా కార్పొరేట్ వైద్యం పొందుతాయిసనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో ముఖ్యంగా గుండె జబ్బులకు అత్యాధునిక సర్జరీ సేవలు అందించనున్నారు. మొత్తం ఆస్పత్రిలోని బెడ్స్‌లో 500 పడకలను గుండె వ్యాధుల రోగులకు కేటాయించనున్నారు.ఈ ఆస్పత్రిలో ఆధునాతన ఆపరేషన్ థియేటర్స్, క్యాథ్‌ల్యాబ్‌లు అందుబాటులోకి రానున్నాయి. అలానే ఈ ఆస్పత్రిలో అవయవ మార్పిడికి చికిత్స కోసం.. నిపుణులైన వైద్యులను కేటాయించడమే కాక.. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఈ ఆస్పత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ కార్డియాక్ డిసీజెస్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాన్ని ప్రారంభించనున్నారు. వీటితో పాటుప్రసూతి, న్యూరాలజీ, ఈఎన్‌టీ, పల్మనరీ, పీడియాట్రిక్ ఇతర విభాగాల్లోనూ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# 2 గంటలకు 11 కోట్లు




**హైదరాబాద్, అక్టోబరు 31, పెన్ పవర్:** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఒక్క సలహా కోసం రూ.11 కోట్లు డిమాండ్ చేసిన ఘటన చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌కు చెందిన ఓ ఇంజనీరింగ్ కంపెనీ కొత్త ప్రొడక్ట్ మార్కెటింగ్ కోసం ఆయన సలహా కోరగా..కేవలం రెండు గంటల కన్సల్టేషన్ కోసం ఈ భారీ మొత్తం అడిగినట్లు సమాచారం. 2019లో వైఎస్సార్‌సీపీకి వ్యూహకర్తగా పనిచేసి తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ప్రశాంత్ కిషోర్, ప్రస్తుతం రాజకీయాలతో పాటు వ్యాపార, సలహా రంగాల్లోనూ కొనసాగుతున్నారు. అయితే ఈ ఫీజు వివరాలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది.ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన వృత్తిపరమైన సేవలకు తీసుకునే భారీ ఫీజు గురించి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారాయి. కేవలం ఒక్క సలహా కోసం ఆయన ఏకంగా రూ. 11 కోట్లు డిమాండ్ చేశారని.. ఆ మొత్తాన్ని ఫీజుగాతీసుకున్నానని ఆయన ఇటీవల స్వయంగా వెల్లడించారు. ప్రశాంత్ కిషోర్ ఈ సలహా సేవలను హైదరాబాద్‌కు చెందిన నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు అందించినట్లు తెలుస్తోంది.నవయుగ కంపెనీ తమ నూతన ఉత్పత్తిని మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు అవసరమైన వ్యూహాలు, సలహా కోసం ప్రశాంత్ కిషోర్ నుంచి కన్సల్టేషన్ కోరింది. వారి ఉత్పత్తిపై ఆలోచనలు పంచుకోవడం, మార్కెటింగ్ టిప్స్, వ్యూహాత్మక సలహా అందించడానికి ప్రశాంత్ కిషోర్ కేవలం రెండు గంటల సమయాన్ని వెచ్చించినందుకు గాను ఈ భారీ మొత్తాన్ని ఫీజుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇది ఆయన వ్యూహకర్తగా వ్యక్తిగత బ్రాండ్‌కు ఉన్న అపారమైన విలువను స్పష్టం చేస్తుంది.ప్రశాంత్ కిషోర్ ప్రస్తుతం బిహార్ రాజకీయాల్లో జన్ సురాజ్ పార్టీని స్థాపించి చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నారు. తన రాజకీయ కార్యక్రమాలకు నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయని ప్రతిపక్షాలు ప్రశ్నించిన నేపథ్యంలో ఆయన ఈ ఆదాయ వివరాలను ఇటీవల బయటపెట్టారు. తాను అందుకున్న ఫీజుపై జీఎస్టీ , ఆదాయ పన్ను సక్రమంగా చెల్లించి, మిగిలిన మొత్తాన్ని తన పార్టీకి విరాళంగా ఇచ్చానని ఆయన ధైర్యంగా ప్రకటించారు. డొల్ల కంపెనీల నుంచి నిధులు వస్తున్నాయనే ఆరోపణలను ఆయన బలంగా తిప్పికొట్టారు. ప్రశాంత్ కిషోర్ గతంలో 2019 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసి.. ఆ పార్టీ ఘన విజయానికి కీలక భూమిక పోషించారు. దీని ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు విశేష ప్రాచుర్యం లభించింది. ప్రశాంత్ కిషోర్ ఈ అసాధారణ సంపాదన కేవలం ఎన్నికల వ్యూహాలకే పరిమితం కాకుండా.. కార్పొరేట్ రంగంలో కూడా ఆయన వ్యూహాత్మక సలహాకు ఉన్న అత్యధిక డిమాండ్‌ను తెలియజేస్తుంది.

# నష్టపోయిన రైతలను ఆదుకోవాలి

**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత శు క్రవారం జు పర్యటించారు. మక్తపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.కవిత మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా రైతులు దారుణంగా నష్టపోయారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడిగా కొనుగోళ్లు చేయటం లేదు. దానికి తోడు వర్షాల కారణంగా రైతు పరిస్థితి దయనీయంగామారింది. మానవతా దృక్పథంతో ప్రభుత్వం వారిని ఆదుకోవాలి. ఎకరాకు రూ. పదివేలు పరిహారం ఇస్తామంటే ఏ మూలకు సరిపోదని అన్నారు.రైతులకు మేలు జరగాలంటే ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలి. మొలకెత్తిన, బూజు పట్టిన, తేమ శాతం ఎక్కువ ఉన్న సరే ధాన్యం కొనుగోలు చేయాలి. కరీంనగర్ లోని తిమ్మాపూర్ మండలం మక్తాపల్లి గ్రామంలో ఉన్నాం. ఇక్కడ కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని నెలరోజులుగా ఉంచారు. రాత్రి పడ్డ వానకు ధాన్యమంతా తడిసి ముద్దైంది. ఇప్పటి దాకా వాళ్లు చాట్లతో ఎత్తుకున్న పరిస్థితి. ఇది చాలా దారుణం, బాధాకరం. నెల రోజులుగా ధాన్యం కుప్పలు పోసి ఉంచారు. ఇప్పుడుప్రకృతి వైపరీత్యం కారణంగా ధాన్యమంతా తడిసి పోయింది. వర్షాల కారణంగా ఇంకా నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. ధాన్యానికి మొలకలు వస్తున్నాయి. మొత్తం దారుణంగా తడిసి పోయింది. ఇలాంటి సందర్భంలో తేమ

శాతం 17 కన్నా తక్కువ ఉండాలని మిల్లర్లు కండిషన్లు పెడుతున్నారు. అది సాధ్యపడదు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలని అన్నారు.

ఇప్పటి వరకు అసలు కొనుగోలు కేంద్రాలే ఎందుకు ప్రారంభించలేదని కలెక్టర్ గారిని ప్రశ్నిస్తున్నా. అసలు ఐకేపీ సెంటర్లు లేకుండా డైరెక్ట్ గా ధాన్యం మిల్లర్లే కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఐకేపీ సెంటర్ల నుంచి మిల్లర్ల వద్దకు ధాన్యం తీసుకెళ్లేందుకు రైతులకు అదనంగా ఖర్చు అవుతోంది. తేమ శాతం ఎక్కువ ఉన్న, బూజు పట్టిన, మొలకలు వచ్చిన సరే ధాన్యం కొనుగోలు చేసేలా మిల్లర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి. భూమి దస్తావేజులు లేవంటూ కౌలు రైతుల ధాన్యం కొంటలేరని చెబుతున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నో హామీలు

ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రైతులను ఇబ్బంది పెట్టటంసరికాదు. వారి ధాన్యం కొనేలా వెసులుబాటు ఇవ్వండి. అదే విధంగా కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించాలని అన్నారు.రైతులకు నష్టం జరగకుండా ఉండాలంటే ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి. లేదంటే రైతుల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఇప్పటికే బీహర్ లో ఎన్నికల కారణంగా కూలీలు రావటం లేదు. దీంతోరైతులు అదనపు కూలీ చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ ఇవ్వలేదు. పైగా వర్షాలతో పంట నష్టం జరుగుతోంది రైతుకు అన్ని రకాలుగా దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. రైతులను ఆదుకోవాల్సినబాధ్యత ప్రభుత్వం పై ఉంది. డైరెక్ట్ గా మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాడానికి
# ప్రతి ఒక్కరూ పాటుపడాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి: పెన్ పవర్:**దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భం గా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డి.వేణు, జె అరుణశ్రీలతో సర్దార్ వల్లభాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లా డుతూ జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్‌మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు. దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని, సర్దార్‌వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనం తరం దేశ ఐకమత్యం, సమగ్ర త,

భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమ వుతామని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించా రు. అం తకుముందు జాతీయ ఐక్యతదినోత్సవం సందర్భం గా ఐటి ప్రాంగణం నుంచి చౌరస్తా వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన 2 కిలో మీటర్ల యూనిటీ ఫర్ రన్ ర్యాలీ ను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారిబి.గంగయ్య , వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నరసాపురంలో ఎక్తా దివాస్ ర్యాలీ

**నరసాపురం పెన్ పవర్:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లో ఏకతా దివాస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ ఐక్యతను చాటుతూ నినాదాలు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సాపురం ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఐక్యత సమగ్రత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సిఐ యాదగిరి మరియు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఆయేషా మీరా తల్లిదండ్రుల పిటిషన్పై విజయవాడ సీబీఐ కోర్టు విచారణ

**విజయవాడ: పెన్ పవర్:** ఆయేషా మీరా తల్లిదండ్రుల పిటిషన్పై విజయవాడ సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. సీబీఐ పునర్విచారణ నివేదిక కాపీలను అప్పగించాలని కోరుతూ ఆయేషా మీరా తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేసిన విషయంతెలిసిందే. నివేదిక కాపీలను పిటిషనర్లకు అందజేస్తామని సీబీఐ కోర్టుకు తెలిపింది. నివేదిక పరిశీలించాక అభ్యంతరాలు చెబుతామని ఆయేషా మీరా తల్లిదండ్రులు వెల్లడించారు. దీంతో కేసు తదుపరి విచారణ నవంబర్21కి విజయవాడ సీబీఐ కోర్టు వాయిదా వేసింది.

# దేశ ఐక్యత సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి..

**గోదావరిఖని పెన్ పవర్:**జాతీయ ఐక్యత దినోత్సవం “రన్ ఫర్ యూనిటీలో” భాగంగా దేశ ఐక్యత సమగ్రత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అలాగే ప్రజలందరూ ఐక్యతగా, బందు భావన కలిగి ఉండాలని, ప్రజల్లో జాతీయ ఐక్యత, సామరస్యం, దేశభక్తి, సమైక్యతా భావం పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. భారత ఐక్యతా స్ఫూర్తికి ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయి పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవ పరుగు రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. ముందుగా జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరుగు కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. రామగుండంపోలీస్ కమీషనరేట్ నుండి రామగుండం మున్సిపల్ ... జంక్షన్ వరకు తిరిగి రామగుండంపోలీస్ కమీషనరేట్ గ్రౌండ్ వరకు పరుగు కొనసాగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ సేవలు, దేశాన్ని ఏక్త బంధంతో కట్టిపడేసిన ఆయన నాయకత్వం ప్రతి ఒక్కరికీ ప్రేరణ అని మనమందరం ఐక్యతతో, స్ఫూర్తితో ముందుకు సాగితేనే దేశ అభివృద్ధి మరింత సాధిస్తుందని అన్నారు.రజాకార్లను విచిన్నం చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఏకం చేసిన స్వేచ్చ వాయువులు పీల్చుకునేల కృషి చేసిన

సర్దార్ వల్లభాయ్ పటేల్ కు రుణపడి ఉండాలని సినీ నటులు సాగర్ అన్నారు. పటేల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా ముందుకు వెళ్లాలని, అందుకు పోలీసుల సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని సిపి అంబర్ కిషోర్ ఝా తెలిపారు. యువత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా దేశభక్తి, సమైక్యతా భావం ప్రతి ఒక్కరికి చేరేలా తమ వంతు సహకారం అందించాలి అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, ఆర్ ఐ లు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, శేఖర్, మల్లేశం, సంపత్, సినీ నటుడు సాగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మైనార్టీ బాయ్ స్ స్కూల్ పీఈటీ పై చర్యలు తీసుకోవాల

### తల్లిదండ్రులుచ విద్యార్థి సంఘ నాయకుల డిమాండ్

**వికారాబాద్:పెన్ పవర్:**వికారాబాద్ శివారెడ్డిపేట్ సమీపంలో ఉన్న తెలంగాణా మైనారిటీ గురుకుల పాఠశాలలో పీఈటీ టీచర్ పిల్లలపై ఇష్టం వచ్చినట్లుగా విద్యార్థులను కొట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ కు చేరుకున్నారు.మా పిల్లలను ఇష్టం వచ్చినట్లు అల్యూమినియం రాడ్ తో కొట్టడంతో భయబ్రాంతులకు గురియై మా పిల్లలు భయంతో బయటకు వచ్చారనీ విద్యార్థుల తల్లి దండ్రులు తెలిపారు.అది గమనించిన హాస్టల్ నర్సు మాకు సమాచారం ఇవ్వడంతో హాస్టల్ దగ్గరకు వచ్చి అడుగుతే ఎవరు కూడా సమాధానం చెప్పకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు.మీ పిల్లలను ఇక్కడ చదివించడం ఇష్టం లేకపోతే కార్పొరేట్ స్కూల్ లో చదివించమని చెప్పడం ఏంది.. ? అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించారు.మైనార్టీ బాయ్స్ గురుకుల పాఠశాల పీఈటినీ సస్పెండ్ చేయాలని తల్లిదండ్రుల విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి ఇలాంటి టీచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. గతంలో మైనార్టీ గర్ల్స్ స్కూల్లో ఇలాంటి సంఘటన జరిగినా పట్టించుకోని అధికారులు అది మరువకముందే పక్కనే ఉన్న బాయ్స్ హై స్కూల్లో మరో సంఘటన జరిగింది. ఇప్పుడైనా అధికారులు స్పందించివెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు తల్లిదండ్రులు డిమాండ్ చేశారు..

## ప్రకాశం బ్యారేజ్ కి తప్పిన పెను ప్రమాదం

**ఇబ్రహీంపట్నం పెన్ పవర్:** ప్రకాశం బ్యారేజ్ కి పెను ప్రమాదం తప్పింది. నదిలో కొట్టుకుపోతున్న పడవను ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం లో స్థానిక జాలర్లు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో పడవని ఒడ్డుకుచేర్చి తుమ్మలపాలెం గ్రామం కృష్ణానది ఒడ్డున నిలిపారు. ఎగువ నుండి వస్తున్న వరద నీటిలో కొట్టుకొస్తున్న బోట్ ను స్థానిక జాలర్లు, ప్రభుత్వ యంత్రాంగం కాపాడారు.

## వికారాబాద్ లో రన్ ఫర్ యూనిటీ

**వికారాబాద్: పెన్ పవర్:**సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు సర్ధార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమనితెలిపారు."రన్ ఫర్ యూనిటీ" వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు.యావత్ భారతావనిలోని ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించి,జాతిఐక్యతకు పునరంకితమై,మాతృదేశ సేవలో తమ వంతు పాత్ర పోషించడం ద్వారానే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు.జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ భారత దేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని లి'జాతీయ ఐక్యతా దినోత్సవం'లిగా జరుపుకోవడం మనందరి అదృష్టం. ఈ 'రన్ ఫర్ యూనిటీ' వంటికార్యక్రమాలు దేశ ఐక్యత, సమగ్రత సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తాయి.స్వాతంత్ర్యం తరువాత, సర్దార్ పటేల్ ఎంతో దార్శనికత, సంకల్పంతో సుమారు 565 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి,భారతదేశాన్ని ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన కృషి వల్లే నేడు మనం సమైక్య భారతాన్ని చూడగలుగుతున్నాం.యువతరం ఆయన ఆశయాలను, దేశ సమగ్రత కోసం ఆయన పడిన తపననుస్ఫూర్తిగా తీసుకోవాలి. దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటూ, అన్ని ప్రాంతాల ప్రజలతో సమైక్యత, సోదరభావాన్ని పెంపొందించాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డిటిసి డిఎస్పి శ్రీనివాసులు, ఏఆర్ డిఎస్పి వీరేష్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ భీమ్ కుమార్, ఆర్ఐ దేవిడ్, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు , సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు. .

## ఖమ్మంలో దారుణం.. సీపీఎం నేత దారుణ హత్య

**ఖమ్మం: పెన్ పవర్:**ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సీపీఎం రైతు సంఘం నేత సామినేని రామారావును గుర్తుతెలియని దుండగులు అత్యంత పాశవికంగా హత్య చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలోశుక్రవారం ఉదయం ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.ృతుడు సామినేని రామారావు రోజూ మాదిరిగానే ఉదయం వాకింగ్కు వెళ్లారు. ఆ సమయంలో మార్గమధ్యంలో ఆయన్ను అడ్డగించిన దుండగులు, పదునైన ఆయుధంతో గొంతుకోసి హతమార్చారు. రక్తపు మడుగులోపడివున్న ఆయన్ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించి, సాక్ష్యాధారాలను సేకరించే పనిలో పడ్డారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ హత్య వెనుకరాజకీయ లేదా వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో పాతర్లపాడు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది

## "ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటాము" అనే సందేశాన్ని అందించడమే ఐక్యత దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం

### గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

స్వాతంత్ర్యం అనంతరం భారత దేశాన్ని సమగ్రంగా, బలంగా నిర్మించడంలో కీలక పాత్ర పోషించిన దేశ తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ రి జయంతి అక్టోబర్ 31 ను భారత ప్రభుత్వం "జాతీయ ఐక్యతాదినోత్సవం గా ప్రకటించి, 2014 అక్టోబర్ 24న అధికారికంగా గుర్తించింది. ఈ సందర్భంగా శక్రవారం గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో "ఐక్యత దినోత్సవం – ఏక్తా దివస్ " కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఇతర పోలీస్ అధికారులు కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, పోలీస్ గౌరవ వందనంతో ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు చేసిన కృషి అపూర్వమైనది. స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న 565 సంస్థానాలను ఒకేభారతావనిగా విలీనం చేయడం ద్వారా జాతీయ సమైక్యతకు శ్రీకారం చుట్టారు. ఇది ఆయన దూరదృష్టి, దేశప్రేమ, దృఢ సంకల్పానికి నిదర్శనం." అని అన్నారు. "భారతదేశం సమైక్యంగా ఉన్నందునే అనేకయుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోగలిగింది. సమాజంలో కూడా మనం తారతమ్యాలు లేకుండా ఐక్యంగా ఉంటే ఏ సమస్యనైనా సమష్టిగా ఎదుర్కోవచ్చు. కాబట్టి 'ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటాము' అనే సందేశాన్ని మనం ఆచరణలో పెట్టాలి." అని ఎస్పీ పేర్కొన్నారు.

"మనమందరం సర్దార్ వల్లభాయ్ పటేల్ సూచించిన ఐక్యతా సిద్ధాంతాలను ఆచరిస్తూ, భారతదేశ సమగ్రతను కాపాడే దిశగా కృషి చేయాలి." అని అన్నారు.

తరువాత జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు పౌరులకు జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.

## 'ఐక్యతా విగ్రహం' వద్ద మోదీ నివాళులు

**అహ్మదాబాద్: పెన్ పవర్:**గుజరాత్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఐక్యతా విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ నుంచి పటేల్ విగ్రహంపై పూలవర్షంకురిపించారు. దేశ ఐక్యతకు పటేల్ చేసిన కృషిని ప్రధాని స్మరించారు. వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఐక్యతా పరేడ్ లు కూడా నిర్వహించారు.

## మేయర్ దంపతుల హత్య కేసు.. ఐదుగురికి ఉరిశిక్ష

**చిత్తూరు: పెన్ పవర్:**చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో చిత్తూరు ఆరో అదనపు కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు ఐదుగురికి ఉరిశిక్ష విధించింది. ఉరిశిక్ష పడిన వారిలో మేయర్ భర్త తరఫు బంధువు చింటూ కూడాఉన్నాడు. 2015 నవంబరు 17వ తేదీన చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్ పై నిందితులు కాల్పులు జరిపి హత్య చేశారు.

## చిగురు మామిడిలో మంత్రి పొన్నం పర్యటన

**కరీంనగర్: పెన్ పవర్:**హుస్నాబాద్ నియోజకవర్గం చిగురు మామిడి మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. చిగురు మామిడి నుండి వస్తున్న వరద ప్రభావంతో సీతారాంపూర్ చౌరస్తా నుండి గ్రామంలోపల వరకు దెబ్బతిన్న రోడ్డు, కూలిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వరద ప్రభావంతో వరి పొలాల్లోకి పూర్తిక ఇసుక మేటలు వేయడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరుపునఆదుకుంటామని హామీ ఇచ్చారు.తరువాత ఇందుర్తి కోహెడ మధ్య లోలెవెల్ బ్రిడ్జిపై నుండి వరద వెళ్తుండటంతో దానిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వకడే, సీపీ గౌస్ ఆలం,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి,ఇతర ముఖ్య నేతలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురికి ప్రతిష్టాత్మకం.. గెలుపుఎవరిదో...

**హైదరాబాద్, అక్టోబరు 31, పెన్ పవర్:** తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీకి చాలా కీలకంగా మారింది. ఈ మూడు పార్టీలకు చెందిన ముగ్గురు నేతలకు ఇక్కడ గెలవడం చాలా అవసరం.ఇక్కడ ఓడితే ఆ నేతల ఇమేజ్ డ్యామేజ్ కావడం కాయం. అందుకే మూడు పార్టీల నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంపై ఇప్పటికే అసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. మరోవైపుఅధిష్టానం వద్ద కూడా ఇమేజ్ డ్యామేజ్ అవుతోది. ఇలాంటి తరుణంలో ఈ ఉపఎన్నిక గెలవకపోతే నాయకత్వ స్థిరత్వంపై సందేహాలు తీవ్రమవుతాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం మద్దతు తీసుకోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీమధ్య మ్యాట్రిక్స్ ఎలా కుదుటపడుతుందన్నది ప్రధాన ప్రశ్న.2018, 2023లో బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌లో ఘన విజయం సాధించింది. మాగంటి గోపీనాత్ గెలిచారు. ఆయన మరణంతో ఉప ఎన్నిక వచ్చింది. సిట్టింగ్‌స్థానం నిలుపుకోవడానికి బీఆర్ఎస్ గోపీనాథ్ భార్యకు టికెట్ ఇచ్చింది. ఇక గోపీనాథ్‌ది ఆంధ్రా నేపథ్యం. జూబ్లీహిల్స్‌లో ఆంధ్రులు ఎక్కేవే. అయితే ఈసారి బీజేపీ కూడా ఆంధ్రా ఓటర్లకు గాలం వేస్తోంది. టీడీపీ రహస్యంగామద్దతు ఇస్తోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ నాయకత్వానికి ఈ గెలుపు ఒక పరీక్ష. ఇక్కడ గెలిస్తే.. మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంటుంది. కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రజా సమస్యలపై దూకుడుపెంచే అవకాశం ఉంటుంది.రాంచందర్‌రావు అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవీ. రాష్ట్ర పార్టీ, కేంద్ర బాధ్యతలు సమన్వయంగా నిర్వహించేవి కావడంతో బీజేపీ గెలుపు ద్వారా పార్టీ క్రెడిబిలిటీనిబలోపేతం చేయాలని లక్ష్యం. ఇదే సమయంలో జూబ్లీహిల్స్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలో ఉంది. అందుకే ఆ పార్టీకి గెలుపు తప్పనిసరి.జూబ్లీహిల్స్‌నియోజకవర్గంలో 1.37 లక్షలమంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో ఎంఐఎం




తరఫున నవీన్ యాదవ్ పోటీ చేశారు. ఈసాకి కాంగ్రెస్ తరఫున బరిలో దిగాడు. మరోవైపు ఎంఐఎం ఈసారి కాంగ్రెస్‌కు లోపాయకారి మద్దతు ఇస్తోంది. అయితే గత ఎన్నికల్లో ఎంఐఎంకే 30 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. 2018, 2023 ఎన్నికల్లో ముస్లింలు మాగంటి గోపీనాథ్‌కు అంగా నిలిచారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఈసారికూడా విజయంపై ధీమాగా ఉంది. అయితే దీనికి చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మైనారిటీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారు. ఇది కాంగ్రెస్‌కు ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీ..ముస్లింల మద్దతు, అధికారంలో ఉండడం బలంగా భావిస్తోంది. అభివృద్ధిని కూడా ప్రచారం చేస్తోంది. ఇక బీఆర్ఎస్ గోపీనాథ్ చేసిన అభివృద్ధిపైనే నమ్మకంతో ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిగెలిపిస్తుందని ధీమాగా ఉన్నారు. ఇక బీజేపీ కూడా కేంద్రం నిధులతో చేసిన అభివృద్ధి, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో మరింత అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. దీంతో రేసులో గెలుపుఎవరిదో అని మూడు పార్టీల నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# బంగాళాఖాతంలో తుఫాను.. తెలంగాణలో ప్రభావం ఎందుకు..

**హైదరాబాద్, అక్టోబరు 31, పెన్ పవర్:**
మొంథా తుఫాను ఏపీలో ఏర్పడింది. తీరం కూడా అక్కడే దాటింది. వాస్తవానికి ఈశాన్య రుతుపవనాలు సమీపించిన వేళ ఈ తుఫాను ఒకరకంగా ఏపీలో భారీ వర్షాలను కురిపించింది అని చెప్పుకోవాలి. అయితే అక్కడి అధికారులు కోస్తా ఆంధ్ర ప్రాంతంలో వర్షాలు విపరీతంగా కురుస్తాయని అనుకున్నారు. కానీ అధికారుల అంచనాలు కూడా తప్పి నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాలలో కుంభవృష్టి కురిసింది. మొంథా తుఫాను చివరికి తెలంగాణపై కూడా తన ప్రతాపాన్ని చూపింది. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి మెదక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలలో బీభత్సంగా వర్షాలను కురిపించింది. వాస్తవానికి ఈ తుఫాను తెలంగాణ రాష్ట్రంలో ఇంతటి విపత్తుకు కారణమవుతు ందని ఎవరూ ఊహించలేదు.మొంథా తుఫాను గమనాన్ని అంచనా వేసిన వాతావరణ నిపుణులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఈ తుఫాను గమనం, వేగం, లక్షణాలు వేరుగా ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవానికి తుఫాన్ తీరం దాటిన తర్వాత కొద్ది గంటల వరకు పరిసర ప్రాంతాల్లో గాలులు విపరీతంగా వీస్తాయి. వర్షాలు కూడా అతి భారీగా కురుస్తాయి. ఈ తుఫాను అంతర్వేదిలో తీరం దాటిన తర్వాతఅక్కడ ఎటువంటి ప్రభావం కనిపించలేదు.. ఏపీలోని జంగారెడ్డిగూడెంలో భారీగా వర్షం కురిసింది..ఏలూరు, కోనసీమ, పశ్చిమగోదావరి ప్రాంతాలలో ఊహించిన స్థాయిలో వర్షం కురువలేదు. ఒక అంచనా ప్రకారం ఎక్కడ కూడా 50 మిల్లీమీటర్ల వర్షపాతానికి మించి నమోదు కాలేదు. వాతావరణ నిపుణులు చెబుతున్న దాని ప్రకారం తుఫాను "ఐ" ప్రాంతంలో 50 కిలోమీటర్ల దూరంలో క్లౌడ్ వాల్స్ ఏర్పడతాయి. క్లౌడ్ వాల్స్ వల్ల పరిసర ప్రాంతాల్లో విపరీతంగా గాలులు, అతి భారీ వర్షాలు కురుస్తాయి.తుఫాన్ తీరం దాటిన తర్వాత అంతర్వేది ప్రాంతానికి దాదాపు 330 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావలి వద్ద అత్యధికంగా వర్షాలు కురిపించే మేఘాలు ఏర్పడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో 20



సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదయింది. వాస్తవానికి తుఫాన్ ఏర్పడిన తర్వాత దానికి కుడి వైపు ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తాయి. ఈదురు గాలులు వీస్తాయి. అయితే అంతర్వేదికి కుడివైపున కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో భారీ వర్షాలు కురవలేదు. అయితే విశాఖపట్నంలో ద్రోణి ప్రభావం వల్ల భారీగా వర్షం కురిసింది.మొంథా తుఫాను సముద్రంలో బాధపడినప్పటి నుంచి గంటకు 15 నుంచి 17 కిలోమీటర్ల వేగంతో ముందుకు కదిలింది. అందువల్లే ఎక్కువ ప్రభావం చూపించలేకపోయింది. దీనికి తోడు తక్కువ సమయంలోనే గాలుల వేగంలో మార్పు వచ్చింది. తుఫాను తీరం దాటిన తర్వాత మేఘాలు అనూహ్యంగా ముందుకు కదిలాయి. ఆ తర్వాత తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మెదక్ ప్రాంతాలలో స్థిరపడిపోయి.. కుంభవృష్టి కురిపించాయి. దీంతో ఈ ప్రాంతాలలో 21 నుంచి సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వాస్తవానికి అక్టోబర్ చివరి వారంలో ఈ స్థాయిలో వర్షాలు కురవడం దాదాపు అరుదు. రాష్ట్రంలో ఈ ఏడాది అంతగా వర్షాలు కురవలేదు. పంటలు చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాల వల్ల నష్టం తీవ్రంగా ఉంది.. చేతికి వచ్చిన పంటలు నీటిపాలయ్యాయి. దీంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయి.

# మూసీ ప్రక్షాళనకు అడగడగునా అడ్డంకులు

**నల్గొండ, అక్టోబరు 31, పెన్ పవర్::**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన మూసీ ప్రాజెక్ట్ ఆధునీకరణకు నోచుకోక అంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మూసీ ప్రాజెక్టు పరిస్థితి ఉంది. సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై 1954 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963 సంవత్సరంలో పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన ఐదేళ్ల వరకు ఎడమ కాలువ 41 కిలోమీ టర్లు, కుడికాలువ 38 కిలోమీటర్ల పొడవున మొత్తం 42 గ్రామాల రైతులకు సాగునీరందించింది.ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక పెరిగిపోవడంతో 30 వేల ఎకరాలకు ఆయకట్టుకు పడిపోయింది. పాలకులు మారుతున్న మూసీ ప్రాజెక్టు పై నిర్లక్ష్యం మాత్రం వీడటం లేదు. ప్రాజెక్టు మీద నిర్మించిన రక్షణ గోడలకు రక్షణ లేకుండా పోయింది.. వెదురు కర్రలేదిక్కయ్యాయి. పర్యాటకులతో, అతిధులతో కిటకిటాడాల్సిన అతిథిగృహం శిధిలావస్థలో ఉంది. క్రస్టర్ గేట్ల నుండి ,ప్రాజెక్టు రక్షణ గోడల నుండి నుండి నీరు లీకేజ్ అవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు.ప్రాజెక్టుపై ఆరుగురు పర్మనెంట్ ఉద్యోగులు, నలు గురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేటాయించే నిధులు సరిపోక మరమ్మతులు పూర్తి స్థాయిలో జరగటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు మూసీ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునీకరణకు పూనుకొని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారుమూసి ప్రాజెక్ట్ 6700 ఎకరాలలో విస్తరించి ఉంది 4.46 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ప్రాజెక్ట్ రోజురోజుకు పూడిక పెరగడంతో సామర్థ్య స్థాయి తగ్గిపోతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెం నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.కుడి కాల్వ పరిధిలో కేతేపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో 23 చెరువులు, ఎడమ కాలువ పరిధిలో సూర్యాపేట, చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల్లో 22 చెరువులు ఉన్నాయి.



కాలువలకు నీటిని విడుదల చేసి నట్లయితే చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండుతాయి. కుడి, ఎడమ కాల్వల కు నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఎకరాల భూము లు సాగులోకి రానున్నాయి. ప్రాజెక్టు మీద ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలవస్థకు చేరాయి. రక్షణ గోడలకు మరమ్మత్తులు చేపట్టలేదు. రక్షణ గోడలు శిథిలమైన స్థానంలో కర్రలు కట్టి మమ అనిపించారు. ప్రాజెక్టు కు సందర్శకులు వచ్చినప్పుడు వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వెదురు కర్రలు విరిగే ప్రమాదం ఉంది. మూసీ ప్రాజెక్టుకు 30 స్కవర్, క్రష్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో 10 స్కవర్ గేట్లను శాశ్వతంగా మూసివేశారు. ఎనిమిది క్రష్ గేట్లలో మూడు గేట్ల నుండి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తుంది. దశాబ్దన్నర కాలంగా గేట్ల నుంచి నీరు లీకేజి అవుతున్న మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్లు ముగిసిన తర్వాత ఉన్న ప్రాంతంలో డ్యాం గోడల నుంచి సైతం నీరు లీకేజీల రూపంలో ప్రవహిస్తుంది. ఈ లీకేజీలు సంవత్సరాల తరబడి అవుతున్న పట్టించుకోవడం లేదు. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్న పరిస్థితి ఉంది.గతంలో పర్యాటకులు, అతిధులతో కలకలలాడిన అతిథి గృహం నేడు వెలవెలబోతుంది. అతిథి గృహానికి మరమ్మత్తులు లేక శిధిలవస్థకు చేరుతుంది. అతిథి గృహం, గేట్లకు కలర్స్, ఇతర మరమ్మతుల కోసం రూ.4 కోట్ల తో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం రక్షణ, మరమ్మతుల కోసంరూ. 75 లక్షలతో ప్రభుత్వం నుండి సాంక్షన్ ఆర్డర్స్ వచ్చాయి కానీ సాంక్షన్ ఆర్డర్స్ వచ్చిన టెండర్లకు ఎవరు ముందుకు రాలేదని త్వరలో మళ్లీ టెండర్ వేసి మరమ్మతులు చేపడతామని ప్రాజెక్టు డి ఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రెండో ప్రాజెక్ట్ అయిన మూసి ప్రాజెక్టును పర్యటకేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణం, పర్యాటకుల సందడి, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి, చుట్టుపక్కల ప్రకృతి అందాలు పర్యాటక కేంద్ర అభివృద్ధికి కావలసిన అన్ని అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# దశ, దిశను మార్చే గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్

**న్యూఢిల్లీ, అక్టోబరు 31, పెన్ పవర్:** అండమాన్ నికోబార్ సముద్రప్రాంతాల్లో భారత్‌కు కీలక ద్వీపం. కొన్ని రోజులుగా ఈ ద్వీపం వార్తల్లో నిలుస్తోంది. కారణం.. గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు. దేశానికి వ్యూహాత్మక మని, అభివృద్ధికి కీలకంగా మారుతుంది అని కేంద్రంచెబుతోంది. ఇక విపక్షాలు మాత్రం దీనిని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. పర్యావరణ హాని అంటూ 70 మంది మేధావులు కేంద్రానికి లేఖ రాశారు. ఇక బీజేపీ మాత్రం దీనిని చైనా ప్రేరేపిత చర్యగా ఆరోపిస్తోంది.నీతిఆయోగ్ రూపకల్పన చేసిన 81 వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టులో అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, టౌన్‌షిప్, గ్యాస్‌సోలార్ విద్యుత్ ప్లాంట్ వంటి మౌలిక సదుపాయాలుఉన్నాయి. ఇవి అన్నీ కలిపి గ్రేట్ నికోబార్‌ను వ్యూహాత్మక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం. మలక్కా జలసంధి నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ద్వీపం సముద్ర భద్రతలో కీలకం. అక్కడ నేవీఎయిర్‌ఫోర్స్ శాశ్వత స్థావరం ఏర్పడితే, భారత్ ఇండో%-%పసిఫిక్‌లో కీలకంగా మారుతుంది. చైనా ఆధిపత్యానికి చెక్ పడుతుంది. చైనా చేపడుతున్న 'స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్' వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు ఇది వ్యూహాత్మక అడుగుగాభావిస్తున్నారు .సింగపూర్ వంటి పోర్టులతో పోటీ ఇవ్వగల ఈ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు ద్వారా ప్రపంచ కంటైనర్ వాణిజ్యంలో భారత్ కొత్త హబ్‌గా ఎదగవచ్చు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు, పర్యాటకంగా దీవులఆదరణ పెరగడం వంటి లాభాలు కూడా ఉన్నాయని కేంద్రం చెబుతోంది. మొదటి దశ పనులు 2028 కల్లా పూర్తవుతాయని అంచనా.ఇదే ప్రాజెక్టుపై విపక్షం మొత్తం వ్యతిరేకత తెలుపుతోంది. గలతియా బే సమీప సముద్రతీరంలో తాబేళ్ల గుడ్ల ప్రాంతానికి నష్టం, లక్షల చెట్ల నరికివేత, సముద్ర జీవాల అంతరాయం వంటి అనేక పర్యావరణ సమస్యలు ప్రస్తావించబడుతున్నాయి. షోంపెన్, నికోబారీ జనసమూహాలు బయటి ప్రభావంతో నష్టపోతాయని, జీవరాశుల జీవనశైలికి భంగం కలుగుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. కేంద్రం మాత్రం ఈ వాదనలను తరచూ రాజకీయ ప్రేరేపితమని కొట్టిపారేసింది. ఆ గిరిజనులను
సమగ్ర అభివృద్ధి వైపుతీసుకురావడమే లక్ష్యమని, పర్యావరణ సమతుల్యతకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది.గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్‌పై భిన్న అభిప్రాయాల మధ్య అసలు కథ అంతర్జాతీయ భద్రతలో దాగి ఉంది. చైనా చుట్టుముట్టే సముద్ర మార్గాల నుంచి ఇండియా తానూ సర్కిల్ రూపొందించుకోవడం మొదటి ప్రయత్నం. నేవీ, ఇంటెలిజెన్స్ వలయాలు బలపడితే ఇండో%-%పసిఫిక్ సముద్రరహదారులపై భారత్ అధిపత్యం సాధించగలదు. ఈ ప్రాజెక్టు ఒక వైపు పచ్చదనం, మరో వైపు జాతీయ భద్రత. కానీ ఒక సత్యం మాత్రం స్పష్టం. ఈ దీవి చిన్నదైనా, దాని మీద ఆధారపడే నిర్ణయాలు వచ్చే దశాబ్దాల్లో భారత భవిష్య దిశను మార్చగలవు

# విచారణ షురూ...

**కడప, అక్టోబరు 21, పెన్ పవర్:** : ఏదైనా నేరంతో తమకు సంబంధం లేకపోతే నిష్పక్షపాతంగా విచారణ జరిపించుకోవచ్చని ఎక్కువ మంది సూచిస్తారు. తమ తప్పు లేదన్నప్పుడు విచారణ ఎలా చేస్తే తమకెందుకులే అన్నట్టు ఉంటారు. కానీ మాజీమంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులు మాత్రం తమపై విచారణ నిలిపివేయాలని పిటిషన్లు దాఖలు చేయడం విశేషం. 2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. అప్పట్లో సిఐడి విచారణకు ఆదేశించింది టిడిపి సర్కార్. అయితే ఎట్టి పరిస్థితుల్లో సిబిఐ విచారణ చేయాల్సిందేనని పట్టుపట్టారు అప్పటి విపక్షనేత జగన్మోహన్ రెడ్డి. టిడిపి సర్కార్ సిబిఐ విచారణకు ఆదేశించింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. సిబిఐ విచారణ అవసరం లేదని తేల్చేశారు. చివరకు వివేకానంద రెడ్డి కుమార్తె సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సిబిఐ దర్యాప్తు అనివార్యం అయింది. గత ఐదేళ్లలో సిబిఐ విచారణ కొనసాగింది. దర్యాప్తు ముగించినట్లు సిబిఐ కోర్టుకు నివేదించింది. కానీ అసలు విచారణ జరపకుండా ముగిసింది అని చెప్పడం సరికాదని వివేక కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలమేరకు కింది కోర్టులో కేసు విచారణను మళ్లీ ప్రారంభించాలని పిటీషన్ దాఖలు చేయడం విశేషం.నాంపల్లి సిబిఐ కోర్టులో సునీత పిటిషన్ దాఖలు చేశారు. మళ్లీ విచారణ ప్రారంభించాలని సిబిఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే ఇప్పటికే సిబిఐ విచారణ ముగిసిందని.. మరోసారి ప్రారంభించవద్దని ఈ హత్య కేసులో నిందితులు కౌంటర్ పిటిషన్లు వేశారు. ఒక్క అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి తప్ప అందరూ పిటిషన్లుదాఖలు చేశారు. వారికి కూడా గడువు ఇచ్చింది కోర్ట్. తప్పకుండా వారుసైతం విచారణ వద్దని కచ్చితంగా పిటిషన్లు దాఖలు చేస్తారు. ఎందుకంటే వివేకానంద రెడ్డి హత్య కేసులో తమ ప్రమేయం లేదని.. అదంతా కుటుంబ వ్యవహారమని.. ఆస్తి కోసమే సునీత, ఆమె భర్త చేయించారని సాక్షిలో ప్రత్యేక కథనాలు రాయించారు. ఆపై గత ఐదేళ్లుగా సిబిఐ విచారణకు వైసీపీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేసింది. అప్పటి సాక్షాలను సైతం చెరిపేసినట్లు వార్తలు వచ్చాయి. ఇవన్నీ ముగిసిన తర్వాత ఇప్పుడు విచారణ ఎందుకన్నది ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుల అభిప్రాయం.ప్రస్తుతం నాంపల్లి సిబిఐ కోర్టు ఆదేశాల కోసం యావత్ తెలుగు రాష్ట్రాలుఎదురుచూస్తున్నాయి. ఒకవేళ కోర్టు సిబిఐ విచారణ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలని ఆదేశిస్తే సంచలనమే. లేదు ఇప్పటివరకు జరిగిన విచారణ ఓకే అని చెప్పినా సంచలనమే. మరోసారి విచారణ అంటే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరమే. ఎందుకంటే సిబిఐ విచారణకు ఏపీ పోలీస్ శాఖ సంపూర్ణంగా సహకరిస్తుంది. విచారణలో సంచలన అంశాలను బయటపెట్టి అవకాశం ఉంది. స్వేచ్ఛగా విచారణ చేపట్టేందుకు ఛాన్స్ ఉంటుంది. అదే జరిగితే వివేకానంద రెడ్డి హత్య కేసులో ఒక్క కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఉన్నారా? లేకుంటే ఆ పై స్థానాల్లో ఉన్నవారు ఉన్నారా? అనేది బయటకు రానుంది. అయితే ఏ క్షణం అయినా నాంపల్లి
సిబిఐ కోర్టు.. వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణకు సంబంధించి సంచలన ఆదేశాలు ఇచ్చే అవకాశం

# అమెరికా, చైనాల కొత్త ప్రయాణం...



**న్యూఢిల్లీ, అక్టోబరు 31, పెన్ పవర్:** అగ్రరాజ్యం అమెరికా.. రెండో అగ్రరాజ్యం చైనా.. ఈ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ట్రంప్ 2.0 పాలనలో చైనాపై సుంకాలతో విరుచుకుపడుతున్నాడు. చైనా కూడా ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు.అమెరికా దిగుమతులపైనా సుంకాలు విధిస్తోంది. మరోవైపు అమెరికాకు ఎగమితి చేసే రేర్ ఎర్త్ మినరల్స్‌పై పట్టు బిగిస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో ఇరు దేశాల అధినేతలు తాజాగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ కొరియా నగరం బూసాన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య గురువారం జరిగిన భేటీ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. రెండు గంటలపాటు ముగిసిన ఈ చర్చలు గత కొన్ని నెలలుగా ఉత్కంఠ రేపిన వాణిజ్య ఉద్రిక్తతలకు కొంత ఊరట తీసుకువచ్చాయి.చైనాపై విధించిన 20 శాతం ఫెంటనిల్ టారిఫ్‌ను 10 శాతానికి తగ్గించారని ట్రంప్ ప్రకటించారు. ఫెంటనిల్ ముడి పదార్థాల అక్రమ రవాణాను అరికట్టే అంశంపై జిన్ పింగ్ వ్యక్తిగతంగా కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమెరికాలో పెరుగుతున్న ఓపియాయిడ్ వ్యసన సంక్షోభానికి పరిష్కారం కోసం ద్వైపాక్షిక సహకారానికి నాంది అని పరిశీలకులు అభిప్రాయపడ్డారుఇక ఇదే సమయంలో అరుదైన ఖనిజాల సరఫరాలో ఇటీవల తలెత్తిన సంక్షోభం ఈ సమావేశంలో పరిష్కారమైంది.
ఇరుదేశాలు ఒక సంవత్సర కాలానికి ఎగుమతి%-%దిగుమతి నిర్బంధాలపై సడలింపు ఇవ్వడానికి అంగీకరించాయి. గతంలో 100 శాతం సుంకాల హెచ్చరికలు అమెరికా నుంచి రావడం, ఇప్పుడు వాటి ఉపసంహరణచైనా పరిశ్రమలకు ఉపశమనం తీసుకువచ్చింది. చైనాతో రైతు ఉత్పత్తుల వ్యాపారం మళ్లీ మొదలవుతుందని ట్రంప్ ప్రకటించారు. అమెరికా సోయాబీన్ ఎగుమతులకు చైనా తక్షణ అనుమతి ఇవ్వడంతో మధ్య పశ్చిమ రాష్ట్రాల వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారనుంది.ట్రంప్ ప్రకారం, యూరప్ సంక్షోభ పరిష్కారంలో చైనా సహకరించడానికి అంగీకరించింది. ఈ అంశం వాషింగ్టన్%-%బీజింగ్ సంబంధాలను కేవలం ఆర్థికం దాటి గ్లోబల్ భద్రతా స్థాయి వరకు విస్తరింపజేసే అవకాశముంది. ఈ చరిత్రాత్మక భేటీ ఎయిర్‌పోర్టు పరిధిలో జరగడం ఆశ్చర్యం కలిగించింది. అయితే సమయాభావం కారణంగా తక్షణంగా ఈ వేదికను ఎంచుకున్నట్లు తెలిందీ.షెడ్యూల్ ప్రకారం ట్రంప్ వెళ్లే ముందు చివరి నిమిషంలో భేటీ ఏర్పాటు కావడంతో అది తాత్కాలిక ప్రదేశంలో పూర్తయింది.ప్రసంగంలో ట్రంప్ జిన్ పింగ్‌ను 'తన కాలంలో అత్యంత మేధావి నాయకుడు'గా చిత్రీకరించారు."10లో 12 మార్కులు ఆయనకు ఇవ్వగలను" అని ఆయన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని ప్రతిబింబించాయి.ఈ భేటీతో తాత్కాలిక ఉద్రిక్తత తగ్గినప్పటికీ, పూర్తి వాణిజ్య ఒప్పందానికిమార్గం ఇంకా ప్రారంభ దశలోనే ఉందని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా వచ్చే ఏడాది చైనాపై వాణిజ్య విధానాల్లో సడలింపు ఇచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు ఈ సమావేశం ద్వారా వెలుగులోకి వచ్చాయి.

# ఆ ఐదు జిల్లాల్లో ముందుగా వరికొనుగోళ్లు

**ఖమ్మం, అక్టోబరు 31, పెన్ పవర్:** మొంథా తుఫాను ప్రభావంతో ఉత్పన్నమైన పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని.. నష్టపోయిన జిల్లాల్లో ముందుగా కొనుగోళ్లుప్రారంభించాలని చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. అధికారుల సెలవులను రద్దు చేసి.. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, 24 గంటలపరిస్థితిపై నివేదికలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.తుఫాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న అత్యవసరపరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత అప్రమత్తత ప్రకటించింది. గురువారం నాడు మంత్రులు.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు , ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి,రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు తక్షణమే చేపట్టాల్సిన సహాయక చర్యలు, ధాన్యం సేకరణ ప్రక్రియపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా వరి కోతల కాలంలో అనుకోకుండా ఏర్పడిన ఈ ఘటపైసీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రతి గింజనూ కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని చెప్పారు.తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ముందుగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలనిఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, వరంగల్, హన్మకొండ లాంటి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగానియమించి.. వారికి పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఎవరైనా సెలవులను రద్దు చేసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించాలని.. నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి ప్రతి 24 గంటలకు ఒకసారి రోజువారీ నివేదికలను కలెక్టర్లకు అందించాలని, పౌర సరఫరాల విభాగం నిరంతరం పర్యవేక్షణ చేయాలనిసూచించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అధికారుల మధ్య సమన్వయాన్ని పెంచాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా ఒక 24 గంటలమానిటరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండేలా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని ఆదేశించారు.చెరువులు, వాగులు, మేజర్, మైనర్
ఇరిగేషన్ ప్రాజెక్టులు, లోలెవల్ కల్వర్టుల వద్ద నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. స్థానికులను అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లించాలని, అవసరమైతే ధాన్యాన్ని సమీపంలోని ఫంక్షన్ హాళ్లు లేదా ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## బయిట పడుతున్న నకిలీ నెయ్యి లెక్కలు



**తిరుమల, అక్టోబరు 31, పెన్ పవర్:** మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్న అప్పన్న అరెస్ట్ తో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది. టీటీడీ కొనుగోళ్ల విభాగం జనరల్ మేనేజర్ ను 2022 లో అప్పన్న సంప్రదించాడు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే అన్ని కంపెనీల వివరాలను తీసుకున్నాడు. టీటీడీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా భోలే బాబా డైరీ యాజమాన్యానికి అప్పన్న ఫోన్ చేశారు. బోలే బాబా కంపెనీ ప్రతినిధి పీపీ శ్రీనివాస్‌కు కాల్ చేశాడు. టీటీడీకి సరఫరా చేసే ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు భోలే బాబా డైరీ యాజమాన్యం కమీషన్ ఇవ్వడానికి నిరాకరించింది. బోలేబాబా డైరీని అనర్హులుగా ప్రకటించేలా చేయడానికి అప్పన్న కుట్ర చేశాడు. బోలేబాబా డైరీ తనిఖీలు చేయాలంటూ టిటిడి ప్రొక్యూర్ మెంట్ జీఎమ్ పై ఒత్తిడి తెచ్చాడు. భోలే బాబా డైరీని అనర్హులుగా ప్రకటించే ప్రయత్నంలో డైరీకి వ్యతిరేకంగా అజ్ఞాత వ్యక్తులతో పిటిషన్లు వేయించాడు. అప్పన్న ఒత్తిడి తేవడం.. కుట్రలతో బోలేబాబా డైరీ నుంచి నెయ్యి సేకరణను టీటీడీ నిలిపివేసింది. భోలే బాబా డైరీ టెండర్ల నుంచి తొలగిపోవడంతో ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రవేశించింది. బోలేబాబా డైరీ కంటే కిలో కు రూ.138 ఎక్కువ కోట్ చేసింది ప్రీమియర్ అగ్రిఫుడ్స్. పోటీ లేకపోవడంతో టీటీడీ నుంచి నెయ్యి సరఫరా కాంట్రాక్టును అగ్రిఫుడ్స్ దక్కించుకుంది. చిన్న అప్పన్నకు రూ.50 లక్షల వరకు ముడుపులు ముట్టినట్లు విచారణలో సిట్ అధికారులు గుర్తించారు. ప్రీమియర్ ఆల్ఫా కంపెనీ సంబంధం ఉన్న హవాలా ఏజెంట్ ద్వారా అప్పన్నకు చేరినట్లు విచారణలో బయటపడింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రమోటర్లతో అప్పన్న నిరంతరం సంప్రదించినట్లు అధికారులు గుర్తించారు. అప్పన్న బ్యాంకు లావాదేవీలను పరిశీలించి అక్రమాల నిగ్గు తేల్చింది సిట్. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో కుట్రను ఛేదించేందుకు అప్పన్నను సిట్ కస్టడీకి కోరనుంది. మాజీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అక్రమాలను సిట్ గుర్తించింది. భోలే బాబా, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, వైష్ణవి డైరీ నెయ్యి నమూనాలను పరీక్షించాలని 2022 లో అదేశాలు జారీ చేసింది. ఛైర్మన్ ఆదేశాలతో నెయ్యి నమూనాలను సీఎఫ్‌టీఆర్‌ఐ-మైసూరుకు టీటీడీ పంపింది. మైసూర్ సీఎఫ్ టిఆర్ఐ ల్యాబ్ నివేదికల్లో నెయ్యిలో వనస్పతి కల్తీలు ఉన్నట్లు నిర్ధారించారు. ల్యాబ్ నివేదికల్లో నెయ్యి కల్తీని ధృవీకరించినా అధికారులు చర్యలు తీసుకోలేదు. కల్తీ నెయ్యి గుర్తించినప్పటికీ కూడా 2022-2024 మధ్య కొనసాగిన నెయ్యి సరఫరా కొనసాగింది. రెండేళ్ల పాటు రూ.250 కోట్ల విలువైన 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా అయినట్టు సిట్ అధికారులు తెలిపారు. గుత్తేదారు కల్తీ నెయ్యి సరఫరా ద్వారా కిలోకు కిలో సుమారు రూ.250 చొప్పున లాభాలు ఆర్జించినట్లు సిట్ గుర్తించింది. అప్పన్న విచారణతో వెలుగుచూసిన అంశాలతో మరికొందరిని నిందితులుగా చేర్చింది సిట్. మాజీ టీటీడీ ఛైర్మన్ పిఎ చిన్న అప్పన్నతో సహా తొమ్మిది మందిని కొత్త నిందితులుగా చేర్చింది. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో మున్ముందు ఇంకెన్ని సంచలన విషయాలు బయటపడుతాయో వేచి చూడాలి

# కళ్యాణదుర్గంలో వైసీపీకి షాక్

**అనంతపురం, అక్టోబరు 31, పెన్ పవర్:** ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఇటీవల పార్టీకి రాజీనామాలు తగ్గాయి కానీ.. చాలా మండలాలతో పాటు మున్సిపాలిటీల్లో ఆ పార్టీ పట్టు కోల్పోయింది. అవిశ్వాస తీర్మానాల్లో వీగిపోయింది. రజక అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. మున్సిపల్ ఛైర్మన్ గా ఉన్న తలారి రాజ్ కుమార్ ను ప్రభుత్వం తప్పించింది. మున్సిపల్ చైర్మన్గా ఉన్న రాజ్కుమార్ గత 15 నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సెప్టెంబర్ 22న ఏపీ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దానిపై సరైన వివరణ ఇవ్వకపోవడంతో ఆ పదవి నుంచి రాజ్ కుమార్ ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మున్సిపల్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. కళ్యాణ దుర్గం మున్సిపల్ ఛైర్మన్ గా రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తరువాత పరిస్థితి మారింది. 2024 నవంబర్ నుంచి 2025 ఏప్రిల్ వరకు కనీసం కౌన్సిలింగ్ మీటింగు జాడలేదు. దీంతో ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పలుమార్లు మున్సిపల్ ఛైర్మన్ కు రాజకీయ హెచ్చరికలు కూడా వెళ్లాయి. ఆయన పెద్దగా పట్టించుకోలేదు. మరో నాలుగు నెలల్లో పదవీకాలం ముగియనుండడంతో తేలిగ్గా తీసుకున్నారు. కానీ ప్రభుత్వం దీనిపై గట్టి చర్యలకు దిగింది.తోపుడు బండి వ్యాపారిగా.. కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ గా ఉన్న తలారి రాజ్ కుమార్ ఒక సామాన్య వైసీపీ కార్యకర్త. తోపుడు బండి పై పండ్ల విక్రయించే సామాన్య వ్యాపారి. 2021 కి ముందు అలానే చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కానీ వైసీపీ పై అభిమానంతో ఆ పార్టీ కార్యకర్తగా పనిచేసేవారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఆయనకు లభించింది. కళ్యాణదుర్గం పదో వార్డు నుంచి కౌన్సిలర్ గా పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆయనకు అనూహ్యంగా ఛైర్మన్ పదవి వరించింది. కానీ రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత స్థానిక రాజకీయాల నేపథ్యంలో అనేక రకాల మార్పులు వచ్చాయి. ఈ తరుణంలోనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదని ఆయనపై ప్రభుత్వం వేటు వేసింది.

# హరీష్ ఇంట్లో కవిత...

**హైదరాబాద్, అక్టోబరు 31, పెన్ పవర్:** మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. సత్యనారాయణ రావు అంత్యక్రియలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు.తీవ్రమైన దుఃఖంలో ఉన్న హరీష్ రావును ఓదార్చారు. హరీష్ రావు తల్లి మాతృమూర్తి స్వయంగా కేసీఆర్ కు సోదరి కావడంతో ఆమెను కూడా ఓదార్చారు. కేటీఆర్ నుంచి మొదలు పెడితే గులాబీ పార్టీకి సంబంధించినకీలక నాయకులు మొత్తం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంత్యక్రియలు దగ్గరుండి నిర్వహించారు.తన్నీరు హరీష్ రావు తండ్రి మరణించినప్పటికీ జాగృతి అధినేత్రి కవిత రాలేదు. పైగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌పెట్టి సంతాపం తెలిపారు. ఈ క్రమంలో కవిత వ్యవహరించిన తీరు పట్ల విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ కవిత తన్నీరు హరీష్ రావును గురువారం పరామర్శించారు. గురువారంకోకాపేటలోని హరీష్ రావు నివాసానికి వెళ్లి సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ రావు కూడా ఉన్నారు.. ఇటీవల కాలంలో కల్వకుంట్ల కవిత హరీష్‌రావును, సంతోష్ రావును లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. కాలేశ్వరం అక్రమాల వ్యవహారాలలో హరీష్ రావుకు పాత్ర ఉందని కవిత ఆరోపించారు. సంతోష్ రావు టానిక్ వ్యవహారాన్ని కూడా కల్వకుంట్ల కవితబయటపెట్టారు. ప్రస్తుతం జనం బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కవిత అనేక సంచలన విషయాలను వెల్లడిస్తున్నారు.కవిత ఉన్నట్టుండి గురువారం హరీష్ రావును పరామర్శించారు.. వాస్తవానికి ఈ పరిణామాన్నిజాగృతి నేతలు కూడా ఊహించలేదు. కవిత అక్కడికి వెళ్తున్నట్టు కొంతమందికి మాత్రమే సమాచారం ఉంది. ఆ వ్యక్తులు ఆ సమాచారాన్ని బయటికి లీక్ కాకుండా చూసుకున్నారు. హరీష్ రావును కవిత పరామర్శించిన
నేపథ్యంలో ఆ ఫోటోలు బయటకు రాకుండా చూసుకున్నారని తెలుస్తోంది. కవిత అంతరంగీకులు ఈ ఫోటోలు తీయడంతో సోషల్ మీడియాలోకి వచ్చాయి. దీంతో పాత పగలు మొత్తం పక్కనపెట్టి కవిత హరీష్ రావువద్దకు వెళ్తే.. హరీష్ రావు మాత్రం తన కోపాన్ని అలాగే ఉంచుకున్నట్టు తెలుస్తోంది.కవిత పరామర్శించిన సందర్భంలో హరీష్ రావు పెద్దగా పట్టించుకోలేదని.. కవిత నమస్కారం చేస్తే ఆయన ప్రతి నమస్కారం చేశారనితెలుస్తోంది. కవిత పెద్దగా మాట్లాడుకుండానే సత్యనారాయణ రావు చిత్రపటం వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సమయంలో కవిత వెంట అనిల్ రావు ఉన్నారు. అనంతరం హరీష్ రావు తోకొంతసేపు మాట్లాడిన కవిత ఆ తర్వాత భర్తతో కలిసి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది..

## జగన్ నేతలకు అల్టిమేటం జారీ చేశారా



**విజయవాడ, అక్టోబరు 31, పెన్ పవర్:** :వైసీపీ అధినేత జగన్ పార్టీనేతలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. ఎవరికి వారే నిర్ణయాలు ప్రకటించడం ఇప్పుడు పార్టీలోనే కాదు రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రాంతీయ పార్టీ అంటే అధినేత ఆలోచనలను పసిగట్టి నేతలు మసులుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు నేతలు కట్టు తప్పుతున్నారని పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. జగన్ ఆలోచనల ప్రకారం నేతలు నడుచుకోవడం లేదనడానికి ఇటీవల జరిగిన అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ కు దూరంగా ఉండటంతో పాటు నేతలతో తరచూ సమావేశాలు కాకపోవడం వల్లనే ఈ రకమైన ఇబ్బందులు పార్టీలో తలెత్తుతున్నాయన్నది వాస్తవం. అందుకే ఆయన కనిపించరట 2019 ఎన్నికలకు ముందు... 2019 ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాట వేదవాక్కుగా నడిచేది. ఏ నిర్ణయమైనా అంతసులువుగా బయటకు చెప్పే వారు కాదు. కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే జగన్ తో మాట్లాడి వచ్చిన తర్వాత పార్టీ, ప్రభుత్వ ఆలోచనను ప్రజల ముందుంచేవారు. ఇక 2019 ఎన్నికల్లో పూర్తిగా జగన్ ఫొటోతోనే గెలిచామన్న భావనలో ఉన్న నేతలు పార్టీ నిర్ణయాలను తప్పుపట్టే సాహసం చేసేవారు కాదు. అందులో నిజం ఉందని చాలా మంది బహిరంగంగా అంగీకరించేందుకు కూడా మొహమాట పడేవారు కాదు. కాని ఎప్పుడైతే జగన్ అధికారానికి దూరమయ్యారో అప్పటి నుంచి అధినేతను కూడా లెక్క చేయని పరిస్థితి నేతల్లో కనిపించడం పార్టీ నాయకత్వంలో ఆందోళన కలిగిస్తుంది. అమరావతి రాజధాని విషయంలోనూ అదే జరిగింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులను జగన్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు. గత ఎన్నికల్లో అదే నినాదంతో వెళ్లారు. కానీ ప్రజలు ఆదరించలేదు. అయితే ఓటమి తర్వాత అమరావతిని రాజధానిగానే ఉంచుతామని ఇప్పుడు చెబుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ కూడా అమరావతి విషయంలో తమ పార్టీ నిర్ణయం తప్పేనని అంగీకరించడం చర్చ జరుగుతోంది. ఇక విశాఖకు గూగుల్ డేటా సెంటర్ విషయంలోనూ తొందరపడి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కానీ జగన్ మాత్రం గూగుల్ సెంటర్ ఏపీకి రావడం మంచిదేదని చెప్పారు. అలాగే ఇప్పుడు విపత్తుల సమయంలోనూ ఎలాంటి ప్రకటనలు ఎవరూ చేయవద్దని, జగన్ మాత్రమే ప్రకటిస్తారని పార్టీ నాయకత్వం నేతలకు అల్టిమేటం ఇచ్చినట్లు తెలిసింది. మరి నేతలు నాయకత్వం మాటలు విని మౌనంగా ఉంటారా? లేదా? అన్నది చూడాలి.

# అన్న బాటలోనే షర్మిల...



**విజయవాడ, అక్టోబరు 31, పెన్ పవర్:** ఏపీలో రాజకీయాలు చాలా విచిత్రంగా నడుస్తున్నాయి. ఒకవైపు అధికారంలో ఉన్న కూటమి ప్రతిదాన్నీ వీలైనంత ఎక్కువ ప్రచారం చేస్తూ అనుక్షణం ప్రజల నాలుకలపై ఉండడానికి ప్రయత్నిస్తుంటే మరువైపు ప్రతిపక్ష పార్టీల అధినేతలు ఎక్కడో వెనకడుగు వేస్తున్నారు అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. దానికి తగ్గట్టే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కీలక సమయాల్లో ఏపీలో ఉండటం లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతుంటే ఇప్పుడాయన చెల్లెలు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా అదే బాటలో ఉంటున్నారు. రాజకీయాల్లో ఇది సరైన స్ట్రాటజీ కాదని నిపుణులు అంటున్నారు.2019 ఎన్నికలకు ముందు తాను "అమరావతిలోనే సొంత ఇల్లు కట్టుకున్నానని చంద్రబాబు ఆ సాహసం చేయడం లేదని" పదేపదే చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి 2024లో పార్టీ ఓడిపోయాక వీలైనంత ఎక్కువ సమయం బెంగుళూరులోనే ఉంటున్నారనే అభిప్రాయం సొంత పార్టీ నేతల నుంచే వ్యక్తం అవుతోంది. నేతలు ముఖ్యమైన విషయాలు ఆయనతో చర్చించాల్సిన అవసరం వచ్చినా లేక రాష్ట్రంలో ఏదైనా అవాంతరం వచ్చినా వెంటనే రియాక్ట్ అవ్వాల్సిన సమయాల్లో బెంగళూరులో ఉన్న జగన్మోహన్ రెడ్డి తాడేపల్లికి వచ్చే వరకు వాళ్లు వెయిట్ చేయాల్సి వస్తోంది. నిన్న మొన్నటి తుపాన్ సమయంలో కూడా అయన బెంగళూరులోనే ఉన్నారు. విజయవాడకు రావాల్సి ఉన్నా విమానాలు క్యాన్సిల్ కావడంతో ఆయన రాలేకపోయారు. దీన్ని ఆయన రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. దీనివల్ల జగన్మోహన్ రెడ్డి ప్రజలకు, పార్టీ నేతలకు అందుబాటులో ఉండటం లేదని అభిప్రాయం ఎక్కువగా ప్రచారం అవుతోంది.

రాజకీయంగా అన్నతో విభేధించి సొంత దారిలో వెళుతున్న షర్మిల నివాసం విషయంలో మాత్రం అన్న బాటలోనే వెళుతోందన్న అభిప్రాయం జనాల్లో ఉంది. నిజానికి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న ఆమెకు సొంత పార్టీ నుంచే చాలా విమర్శలు వస్తున్నాయి. పార్టీలో అసమ్మతిని సానుకూలం చేసుకోవాల్సిన అవసరం ఆమెకు ఉంది. తుపాను లాంటి విపత్కర పరిస్థితుల్లో అధికారంలో ఉన్నా లేకపోయినా రాజకీయ పార్టీల అధినేతలు ప్రజలకు నేతలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. దానివల్ల క్షేత్రస్థాయిలో పార్టీ నేతలకు ఒక భరోసా ఉండడంతోపాటు

సమన్వయంతో పని చేసే అవకాశం ఉంటుంది. కానీ షర్మిల వీలైనంత ఎక్కువగా హైదరాబాదులో ఉండడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. విజయవాడ సమీపంలో ఇల్లు కొన్నారన్న ప్రచారం జరిగినా ఆమె ఇంతవరకు అక్కడకు వెళ్ళింది లేదు. ఆమె కుటుంబ వ్యవహారాల రీత్యా ఎక్కువగా విదేశాల్లో ఉన్న పిల్లల దగ్గరకు వెళుతున్నారు. మరోవైపు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసుడిగా తన కుమారుడిని ప్రొజెక్ట్ చేసే ప్రయత్నాలూ చేస్తున్నారు. ఇలాంటి కీలక బాధ్యతలు ఎత్తుకున్న షర్మిల తాను ఆంధ్రప్రదేశ్‌లో ఉండాల్సిన అవసరం చాలా ఎక్కువగా ఉంది. కానీ ఎందుకో మరి ఆమె ఇక్కడ నివాసం ఉండడం లేదు. ఇది రాజకీయంగా చాలా రాంగ్ స్ట్రేటజీ అని

విశ్లేషకులు చెప్తున్నారు. ఇలాంటి విషయాల్లో కూటమి చాలా వేగంగా దూసుకుపోతోంది. అది తుపాను అయినా వరదైనా ప్రచారంలో మాత్రం ఏ లోటూ రానీయదు. కొన్నిసార్లు ఈ ప్రచారం ఒక హద్దు దాటిందని, అతివృష్టి చేస్తున్నారని ట్రోల్స్ వస్తున్నా అనుక్షణం ప్రజల దృష్టిలో ఉండడానికి కూటమి ప్రయత్నిస్తోంది. ఈ ప్రచారంతో పోటీ పడడం మాట ఎలా ఉన్నా ముందు సొంత పార్టీ నేతలకు అందుబాటులో ఉండడానికి %హ% జగన్, షర్మిల లాంటి నేతలు స్థానికంగా ఎక్కువగా ఉండడానికి ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని అనువజ్ఞులు చెబుతున్నారు. కమ్యూనిస్టు నేతలు కూడా ఇప్పటికే వరద ప్రాంతాల్లో పర్యటించి వచ్చిన పరిస్థితుల్లో దివంగత ముఖ్యమంత్రి పిల్లలు, రెండు వేరు వేరు పార్టీలకు అధినేతలు ఇలాంటి విషయాల్లో వెనుక పడడం రాంగ్ స్ట్రాటజీ అనే అభిప్రాయం చాలా మందిలో ఉన్న మాట వాస్తవం. మరి ఇప్పటికైనా జగన్, షర్మిల ఆ దిశగా ఆలోచిస్తారేమో చూడాలి.

# లోకేష్ పేరును వదలని సైబర్ చీటర్స్



**విజయవాడ, అక్టోబరు 31, పెన్ పవర్:**
సైబర్ నేరాల తీరు మారుతోంది. ఇప్పటివరకు సామాన్యులే టార్గెట్ అయ్యేవారు. ఇప్పుడు సెలబ్రిటీలను సైతం వదలడం లేదు. వీఐపీల పేర్లు, ఫోటోలు వాడుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మొన్న మధ్యన రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరిని టార్గెట్ చేసి కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్ పేరుతో 57 లక్షల రూపాయలు కొల్లగొట్టేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏపీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇది సంచలన అంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.ఏపీకి చెందిన ఓ వ్యాపారికి.. మంత్రి నారా లోకేష్ ప్రొఫైల్ పిక్చర్ గా ఉన్న ఓ వాట్సప్ నుంచి సమాచారం వచ్చింది. కీలకమైన ప్రాజెక్టులకు డబ్బు అవసరం ఉందని చెప్పి.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఫోన్ కాల్ చేసి అచ్చంగా మంత్రిగా మాట్లాడారు. అయితే అది నిజమేనని భావించిన సదరు వ్యాపారి పలు విడతల్లో 57 లక్షల రూపాయల వరకు అలా బెదిరించిన వ్యక్తులకు పంపించాడు. చివరకు ఇది మోసంగా భావించి ఏపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు రాజేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో హైదరాబాదులో సాయి శ్రీనాథ్, సుమంత్ అనే ఇద్దరు వ్యక్తులను హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ ఘటన వెనుక పెద్ద ముఠా హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలను టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.కొద్ది రోజుల కిందట ఖమ్మం జిల్లా టిడిపి నేతలను ఇలానే సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో వాట్సాప్ కాల్ చేశారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి నిధులు కావాలని.. అందుకు విరాళాలు అందించాలని కోరడంతో కొందరు నేతలు నగదు పంపించారు. అదే సమయంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల్లో బీఫారాలు కావాలంటే కొంత మొత్తం చెల్లించాలని కోరడంతో.. రెండోసారి కూడా సదరు నేతలు నగదు జమ చేశారు. అమరావతి వస్తే పార్టీ అధినేత చంద్రబాబుతో బీఫారాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. విజయవాడలో వారి పేరుతో హొటళ్లు కూడా బుక్ చేశారు. దీంతో ఇది నిజమని నమ్మిన నేతలు విజయవాడ వెళ్లి హొటల్లో దిగారు. అయితే అక్కడ బిల్లు చెల్లించే క్రమంలో వివాదం జరిగింది. తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని గుర్తించిన సదరు నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేశారు. బయటకు చెబితే పరువు పోతుందని భావించారు. ఇంకోవైపు రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరు హైదరాబాదులో ఇలానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. అయితే ఇప్పుడు మంత్రి నారా లోకేష్ పేరు చెప్పి సైబర్ నేరానికి పాల్పడడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకే కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# సత్యసాయి శత జయంతి వేడుకలు..

## ప్రభుత్వం నిర్వహిస్తే తప్పేంటి.. హైకోర్టు వార్నింగ్

**అనంతపురం, అక్టోబరు 31, పెన్ పవర్:**
పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. లౌకిక దేశంలో మతపరమైన వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై పటిషనర్ అభ్యంతరం తెలిపారు. అయితే సత్యసాయి ట్రస్ట్ చేసిన ప్రజా సేవలను పరిగణనలోకి తీసుకుని గౌరవించడంలో తప్పేముందని సూటిగా ప్రశ్నించింది. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని లేదంటే ఖర్చులు విధిస్తూ.. వ్యాజ్యాన్ని కొట్టివేస్తామని వార్నింగ్ ఇచ్చింది
పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. నవంబరు 23న జరిగే ఈ వేడుకలకు హాజరు కావాలని.. ఇప్పటికే ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, మంత్రులకు.. శ్రీ సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఆహ్వానాలు అందజేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ కూడా హాజరు కానున్నారు. అయితే ఈ ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహించడంపై ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని ఆపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులను ఇలా మతపరమైన కార్యక్రమాలకు మళ్లించడానికి వీలు లేదంటూ ఆ పిటిషన్‌లో అభ్యంతరం తెలిపారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు పటిషనర్‌కు వార్నింగ్ ఇచ్చింది.సత్యసాయి శతజయంతి ఉత్సవాలను రాష్ట్రప్రభుత్వం అధికారిక వేడుకగా నిర్వహిస్తే తప్పేముందని భారత హేతువాద సంఘాన్ని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. సత్యసాయి ట్రస్ట్ ద్వారా మూడు జిల్లాలకు తాగునీరు అందించారని.. ఈ విషయం రాష్ట్రానికి వచ్చిన కొత్తలో తన సహచరుల ద్వారా తనకు తెలిసిందని జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. అంతే కాకుండా ఆసుపత్రులు, విద్యాసంస్థలు సైతం స్థాపించి ప్రజలకు సేవ చేస్తున్నారని పిటిషనర్‌కు ఈ సందర్భంగా హైకోర్టు గుర్తుచేసింది. ఇలాంటి విశిష్ట వ్యక్తులను గౌరవించడంలో తప్పేముందంటూ వెంకట సుబ్బయ్యను సూటిగా ప్రశ్నించింది. తాను దాఖలు చేసిన పిల్‌ను వెంకట సుబ్బయ్య వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. లేకుంటే ఖర్చులు విధించి పిల్ కొట్టేస్తామని వార్నింగ్ ఇచ్చింది. నిజంగా ప్రజా ప్రయోజనం ఉన్న వ్యాజ్యాలపై దృష్టి సారించాలని హితవు పలికింది.విచారణ సందర్భంగా భారత హేతువాద సంఘం తరఫున వాదించిన న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్.. లౌకిక రాజ్యంలో మతపరమైన కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు వినియోగించడానికి వీలు లేదన్నారు. దీనికి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి కౌంటర్ వాదనలు వినిపించారు. వివిధరకాలుగా ప్రజా సేవ చేసిన 22 మంది వ్యక్తుల జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కోర్టుకు నివేదించారు. సత్యసాయి నెలకొల్పిన ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో పలు సామాజిక సేవలు అందుతున్నాయని వెల్లడించారు. శ్రీసత్యసాయి సేవలను పరిగణనలోకి తీసుకొని జయంతిని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. సరైన అధ్యయనం చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఎలా జారీ చేస్తుందని పిటిషనర్‌ను ప్రశ్నించారు.

# పాత జిల్లాలోనే కలిపేయండి

**కర్నూలు, అక్టోబరు 31, పెన్ పవర్:**
ఏపీలో జిల్లాల పునర్విభజన వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు తమను నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో కలపాలని కోరుతున్నారు. వైద్య, ఉపాధి అవసరాలకు కర్నూలు దగ్గరగా ఉండటమే దీనికి కారణం. గతంలోనూ కర్నూలు జిల్లాలోనే ఉన్న డోన్ వాసులు, ఈ మార్పు తమకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో డిమాండ్ తెరపైకి వచ్చింది. తమను నంద్యాల జిల్లా నుంచి తీసుకెళ్లి కర్నూలు జిల్లాలో కలిపేయాలని డోన్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. డోన్ నియోజకవర్గం నంద్యాల జిల్లాలో కలపడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో డోన్ నియోజకవర్గం కర్నూలు జిల్లాలోనే ఉండేది. దీంతో డోన్ వాసులు చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా కర్నూలులోని పెద్దాసుపత్రికి వెళ్లేవారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగులు, కూలీలు కూడా ఉపాధి, ఉద్యోగాల కోసం కర్నూలుకు వెళ్లేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోకి విలీనం అయింది. ఈ మార్పును వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు అనేక విజ్ఞప్తులు చేశారు.డోన్ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు. 2 లక్షలకు పైగా ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, డోన్ పట్టణ, మండలాల నుంచి 90 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. చారిత్రాత్మకంగా, డోన్ ప్రాంతం నుంచి ఎన్నికైనవారు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా చేపట్టారు. ప్రస్తుతం, డోన్‌ను కర్నూలు జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. డోన్ నుంచి కర్నూలుకు హైవే మార్గంలో కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.. 50 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అయితే నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 90 కిలోమీటర్లు ప్రయాణించి గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది.డోన్ ప్రాంత ప్రజలు వైద్య అవసరాల కోసం, ఉపాధి అవకాశాల కోసం కర్నూలు దగ్గరగా ఉండటంతో అక్కడికే వెళ్లడం సౌకర్యంగా ఉందంటున్నారు. నంద్యాలకు కేవలం జిల్లా అధికారులతో పనులుంటేనే వెళు న్నారట. ప్యాపిలి మండల ప్రజలు కూడా తమ ప్రాంతాన్ని కర్నూలు

జిల్లాలోనే ఉంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. డోన్, ప్యాపిలి ప్రాంతాల ప్రజల్లో 95 శాతం మందికి పైగా తమ ప్రాంతాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు.డోన్ ప్రజలు కోరుకున్నట్లుగానే కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూడా హామీ ఇచ్చామని.. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రికి సైతం లేఖను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లోపు ఈ జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరి డోన్‌వాసుల రిక్వెస్ట్‌ను పరిగణలోకి తీసుకుంటారలో లేదో చూడాలి. మరి డోన్ ప్రజల రిక్వెస్ట్‌పై ప్రభుత్వం, కేబినెట్ సబ్ కమిటీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని డోన్‌వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కర్నూలు బస్సు ప్రమాదంలో మూడో వాహనం ప్రమేయం

**కర్నూలు అక్టోబరు 31, పెన్ పవర్:**
కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన స్లీపర్ బస్సు ప్రమాదంలో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. మొదట బస్సు వేగంగా వచ్చి బైక్ ని ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందని అనుకున్నారు. ఆ తర్వాత కింద పడిపోయిన బైక్ ని బస్సు ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్లడం వల్ల ప్రమాదం జరిగిందని నిర్ధారించుకున్నారు. ఇప్పుడు ఆ గ్యాప్ లో ఏం జరిగిందనే విషయాలు హైలైట్ అవుతున్నాయి. బైక్ కింద పడిన తర్వాత స్లీపర్ బస్సు ఆ బైక్ ని ఢీకొనే ముందు 14 వాహనాలు అదే రూట్ లో బైక్ ని దాటుకుని వెళ్లాయని పోలీసులు గుర్తించారు. ఈ 14 వాహనాల్లో ఓ బస్సు కూడా ఉంది. ఆ బస్సు బైక్ ని ఢీకొంది కానీ ప్రమాదం ఏమీ జరగలేదు. ఆ బస్సు ఢీకొనడం వల్ల బైక్ కాస్త పక్కకు జరిగింది. అది కూడా డివైడర్ నుంచి జరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. ఆ తర్వాత స్లీపర్ బస్సు ఢీకొని దాన్ని ఈడ్చుకుని వెళ్లడం వల్ల ఘోరం జరిగిపోయింది. 19మంది సజీవ దహనం అయ్యారు. అదే జరగకపోయి ఉంటే..? కర్నూలు బస్సు ప్రమాదం జరిగిన తర్వాత అలా జరగకపోయి ఉంటే అనే కోణంలో చాలా ప్రశ్నలు, సమాధానాలు వినపడుతున్నాయి. అసలు ఆ బైక్ యాక్సిడెంట్ జరిగి డ్రైవర్ చనిపోకపోయి ఉంటే ఆ రోజు రాత్రి ఆ బైక్ అక్కడ పడి ఉండేది కాదు, అదే లేకపోతే స్లీపర్ బస్సు యధావిధిగా సాఫీగా వెళ్లిపోయేది. సో ప్రమాదం జరిగే ఛాన్సే లేదు. పోనీ బైక్ డివైడర్ ని ఢీకొని పడిపోయింది, డ్రైవర్ శివశంకర్ చనిపోయాడు. అతని స్నేహితుడు శశివశంకర్ శవాన్ని పక్కకు లాగేశాడు కానీ బైక్ ని పక్కకు తీయలేకపోయాడు. ఈలోగా వరుసగా వాహనాలు రావడంతో అతను భయపడి పారిపోయాడని తెలుస్తోంది. ఒకవేళ అతడు బైక్ ని కూడా పక్కకు లాగగలిగి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. అది కూడా తీసేద్దాం. స్లీపర్ బస్సు, బైక్ ని ఢీకొని లాక్కెళ్లే లోపల 14 వాహనాలు అటుగా వెళ్లాయి. అందులో ఏ ఒక్క వాహనం ఆగి చూసినా ఆ బైక్ ని ఎవరో ఒకరు పక్కకు తీసేవారు. అప్పుడు కూడా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఇక చివరిగా ఆ బైక్ ని ఢీకొన్న మరో బస్సు ఈ ప్రమాదానికి అసలు కారణంగా తెలుస్తోంది. ఆ బస్సు ఢీకొనడం వల్లే బైక్ డివైడర్ పక్కనుంచి కాస్త జరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. దీంతో స్లీపర్ బస్సు దాన్ని ఢీకొని ఘోర ప్రమాదానికి కారణం అయింది. 19మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. ఆ మూడో వాహనం.. స్లీపర్ బస్సు ఢీకొనడానికి ముందు ఆ బైక్ ని ఢీకొన్న వాహనం ఇప్పుడు హైలైట్ అవుతోంది. అది ఒక ఓమ్ని బస్సు. ఆ బస్సు నడిపిన డ్రైవర్ గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. బైక్ రోడ్డుకి అడ్డుగా పడి ఉంది, దాన్ని తన బస్సు తాకింది అని తెలిసిన వెంటనే కనీసం ఆ డ్రైవర్ పక్కన బస్సు

ఆపి దాని వద్దకు వెళ్లి ఉండాలి, లేదా వెనక వచ్చే వాహనాలను అప్రమత్తం చేసి ఉండాలి. అవేవీ జరగకపోవడం వల్ల ఈ ఘోరం జరిగిపోయింది. అంటే ఇక్కడ 19మంది ప్రయాణికులు చనిపోవడానికి కారణాలు అనేకం. ఇక్కడ నిర్లక్ష్యం ఒక్కరిదే అని చెప్పడానికి లేదు. అందరి నిర్లక్ష్యం కలగలిసి ఆ ప్రమాదానికి కారణం అయింది. చిట్టచివరిగా స్లీపర్ బస్సు డ్రైవర్ మంటలు చూసి పారిపోయాడే కానీ, ప్రయాణికుల్ని హెచ్చరించలేదు. అదే జరిగి ఉంటే కనీసం మరణాల సంఖ్య బాగా తగ్గి ఉండేది. అదృష్టం బాగుంటే అందరూ ప్రాణాలతో బయటపడేవారు. కానీ బస్సు డ్రైవర్ ఆ పని చేయలేదు. మంటలు చెలరేగగానే బస్సుని ఆపేసి భయంతో పరుగులు తీశాడు. కనీసం ఏ ఒక్కర్నీ అలర్ట్ చేయలేదని తెలుస్తోంది. ఇలా అందరి నిర్లక్ష్యం ఆ బస్సుని మంటల్లోకి నెట్టేసింది. 19మంది ప్రయాణికులు సజీవ దహణం కావడానికి కారణం అయింది

## వారితోనే అసలైన అగ్ని పరీక్ష: ఫైనల్లో సౌతాఫ్రికాతో ఢీ.. ఇండియాను భయపెడుతున్న ఇద్దరు సఫారీ ప్లేయర్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా, సౌతాఫ్రికా తలపడనున్నాయి. ఇప్పటివరకు ఒకసారి కూడా టైటిల్ గెలవని రెండు జట్లు తొలి టైటిల్ కోసం ఆరాటపడుతున్నాయి. ఇండియా ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ కు వచ్చి ఓడిపోతే.. సౌతాఫ్రికా తొలిసారి వరల్డ్ కప్ ఫైనల్ కు చేరుకుంది. ఈ రెండు జట్లు తుది సమరానికి చేరుకోవడంతో మ్యాచ్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రెండు జట్లు బలంగా ఉండడంతో విజేతను అంచనా వేయడం కష్టంగా మారుతుంది. ఆదివారం (నవంబర్ 2) ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ఫైనల్ జరగనుంది. సౌతాఫ్రికా జట్టులో ఇద్దరు మ్యాచ్ విన్నర్లను ఆపకపోతే ఇండియా ఫైనల్లో గెలవడం కష్టం. వారిలో ఒకరు కెప్టెన్ లారా వోల్వార్ట్ కాగా మరొకరు ఆల్ రౌండర్ మారిజాన్ కాప్. వోల్వార్ట్ ఇంగ్లాండ్ పై జరిగిన సెమీ ఫైనల్లో భారీ సెంచరీతో విరుచుకుపడింది. బుధవారం (అక్టోబర్ 29) గౌహతి వేదికగా బర్సపారా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ సెమీస్ పోరులో వోల్వార్ట్ నెక్స్ట్ లెవల్ ఇన్నింగ్స్ ఆడుతూ 169 పరుగులు చేసి మారథాన్ ఇన్నింగ్స్ ఆడింది. ఒక్కసారి క్రీజ్ లో కుదురుకుంటే ఈ సఫారీ కెప్టెన్ ను ఆపడం కష్టం. ఫైనల్లో టీమిండియా వోల్వార్ట్ ను ఆపకపోతే విజయం కష్టమవుతోంది.

**మారిజాన్ కాప్ ఆల్ రౌండ్ షో :**

సౌతాఫ్రికా ఆల్ రౌండర్ మారిజాన్ కాప్ సూపర్ ప్రస్తుతం సూపర్ ఫామ్ లో ఉంది. అటు కొత్త బంతితో బౌలింగ్ చేసే కప్.. మిడిల్ ఓవర్స్ లో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టును నిలబెడుతుంది. నిలకడగా ఆడుతూ తన అనుభవాన్ని చూపిస్తుంది. ఈ టోర్నీలో టాప్ ఫామ్ లో ఉన్న కప్ టీమిండియాకు అగ్ని పరీక్షగా మారనుంది. బ్యాటింగ్ లో నిలబడితే భారీ ఇన్నింగ్స్ లు ఆడగలదు. బౌలింగ్ లో తన స్వింగ్ తో వణికించగలదు. సెమీస్ లో కప్ అద్భుత ప్రదర్శన చేసింది. మొదట బ్యాటింగ్ లో 42 పరుగులు చేసిన ఈ సఫారీ ఆల్ రౌండర్.. ఆ తర్వాత బౌలింగ్ లో ఏకంగా 5 వికెట్లు పడగొట్టి మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసింది.

## ఇండియా వరల్డ్ కప్ గెలిస్తే.. జెమీమాతో కలిసి పాట పాడతా: సునీల్ గవాస్కర్





**హైదరాబాద్ పెన్ పవర్:** స్వదేశంలో జరుగుతోన్న ఉమెన్స్ వరల్డ్ కప్?లో అతిథ్య ఇండియా ఫైనల్?కు దూసుకెళ్లింది. సెమీస్?లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసి సగర్వంగా భారత్ ఫైనల్?కు చేరుకుంది. ఇండియా ఫైనల్?కు వెళ్లిందంటే కారణం జెమీమా రోడ్రిగ్స్. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. కళ్లముందు కొండంత లక్ష్యం.. మరోవైపు ఓపెనర్లు త్వరగా ఔట్ అయ్యారు.. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జెమీమా అసాధారణ పోరాట పటిమ కనబర్చింది. మహిళల క్రికెట్లోనే బలమైన బౌలింగ్ లైనప్ కలిగిన ఆస్ట్రేలియాపై చివరి వరకు క్రీజులో నిలబడి వీరోచిత సెంచరీ చేసింది. జెమీమా చిరస్మరణీయ ఇన్సింగ్స్?తో ఇండియా ఫైనల్? పోరుకు దూసుకెళ్లింది. ఓపిక లేకున్నా జట్టు విజయం కోసం శరీరంలోని బలాన్నంతా కూడగట్టుకుని చివరి వరకు క్రీజులో నిలబడి ఇండియాకు అపూర్వ విజయం అందించిన జెమీమాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలోనే టీమిండిమా మాజీ దిగ్గజం సునీల్ గవాస్కర్ జెమీమాపై పొగడ్తలు కురిపించారు. ఆస్ట్రేలియా వంటి బలమైన ప్రత్యర్థిపై జెమీమా ఇన్సింగ్స్ అద్భుతమని కొనియాడారు. తీవ్ర ఒత్తిడిలో జెమీమా చూపించిన పోరాటం అసాధారణమని ప్రశంసించారు. ఈ సందర్భంగా సునీల్ గవాస్కర్ ఒక వాగ్ధానం చేశారు. ఉమెన్స్ వరల్డ్ కప్ టైటిల్ ఇండియా గెలిస్తే.. జెమీమా రోడ్రిగ్స్?తో కలిసి ఒక పాట పాడుతానని చెప్పారు. ఆమె గిటార్ వాయిస్తుంటే తాను పాట పాడుతానని అన్నారు. జెమీమాకు ఇష్టం ఉంటనే ఈ పని చేస్తానన్నారు. గతంలో ఓసారి బీసీసీఐ అవార్డుల కార్యక్రమం సందర్భంగా తాము ఇలా చేశామని గవాస్కర్ గుర్తు చేశారు. జెమీమా గిటార్ వాయిస్తుంటే.. తాను పాడానని వివరించారు. టీమిండియా వరల్డ్ కప్ గెలిస్తే.. మరోసారి ఆ సీన్ రిపీట్ చేయాలనుకుంటున్నానని గవాస్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఆస్ట్రేలియాను చేజేతులా ఓడించిన కెప్టెన్.. ఇండియాకు వచ్చిన స్టార్క్‌కు చేదు జ్ఞాపకం



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా అద్భుతంగా ఆడినప్పటికీ టీమిండియాపై ఓటమి తప్పలేదు. మొదటి బ్యాటింగ్ చేసి 338 పరుగుల భారీ స్కోర్ చేసి భారత జట్టుకు ఛాలెంజ్ విసిరింది. ఆ తర్వాత ఓపెనర్లను త్వరగా ఔట్ చేసి మ్యాచ్ పై పట్టు బిగించారు. ఇక ఆసీస్ విజయానికి తిరుగు లేదనుకుంటున్న సమయంలో టీమిండియా ప్లేయర్స్ జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్ కౌర్ భారీ భాగస్వామ్యంతో జట్టును నిలబెట్టారు. కౌర్, జెమీమా మూడో వికెట్ కు 167 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించి విజయానికి బాటలు వేశారు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఆస్ట్రేలియా వెనకడుగు వేసింది. వాస్తవానికి ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా వచ్చిన అవకాశాలను జారవిడిచింది. ముఖ్యంగా ఆసీస్ కెప్టెన్ అలిస్సా హీలీ జట్టు ఓటమికి కారణమైంది. అందివచ్చిన రెండు ఈజీ ఛాన్స్ లను జారవిడిచింది. మొదట హర్మన్ ప్రీత్ కౌర్ ఈజీ స్టంపింగ్ ను మిస్ చేసిన హీలే.. ఆ తర్వాత జెమీమా ఇచ్చిన సులువైన క్యాచ్ ను జారవిడిచింది. ఆ సమయానికి రోడ్రిగ్స్ 82 పరుగులు వద్ద బ్యాటింగ్ చేస్తుంది. ఇండియా స్కోర్ 206. ఈ సమయంలో జెమీమా ఔటై ఉంటే మ్యాచ్ లో ఆస్ట్రేలియా పట్టు సాధించేది. హీలే తన చెత్త ఫీల్డింగ్ తో పాటు కెప్టెన్సీలోనూ విఫలమైంది. అంతేకాదు బ్యాటింగ్ లోనూ 15 బంతుల్లో 5 పరుగులే చేసి విఫలమైంది.ఇలా అన్ని విభాగాల్లో ఈ ఆసీస్ సారధి విఫలమై జట్టు విజయానికి కారణమైంది. హీలే కోసం ఇండియాకు వచ్చిన మిచెల్ స్టార్క్ తన భార్య ప్రదర్శనతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఆస్ట్రేలియా నుంచి మ్యాచ్ చేజారుతున్న సమయంలో విచారం వ్యక్తం చేశాడు. హీలే ఎక్కడ మ్యాచ్ ఆడిన స్టార్క్ చూడడానికి వెళ్తాడు. తన భార్య కోసం ఆస్ట్రేలియా నుంచి ఇండియాకు వెళ్లిన స్టార్క్ కు ఈ మ్యాచ్ చేదు జ్ఞాపకంగా మిగిలింది. ఇదిలా ఉంటే ఈ వరల్డ్ కప్ తనకు చివరి టోర్నీ అని ఆస్ట్రేలియా కెప్టెన్ కన్ఫర్మ్ చేసింది. లీగ్ దశలో వరుస సెంచరీలతో హోరెత్తించిన హీలే.. నాకౌట్ లో మాత్రం ఒత్తిడిలో చేతులెత్తేసింది.ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. మహిళల వరల్డ్ కప్ లో టీమిండియా అద్భుతం చేసింది. ఆస్ట్రేలియా విధించిన 339 పరుగుల అసాధారణ లక్ష్యాన్ని ఛేజ్ చేసి ఫైనల్ కు దూసుకెళ్లింది. గురువారం (అక్టోబర్ 30) నవీ ముంబై వేదికగా డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ముగిసిన మ్యాచ్ లో 5 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (127) వీరోచిత సెంచరీతో చివరి వరకు క్రీజ్ లో ఉండి టీమిండియాకు విజయాన్ని అందించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 89 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 48.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ఇండియా 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 341 పరుగులు చేసి గెలిచింది.

ఎర్ర చీరలో నువేక్ష అతిలోక సుందరి



## చియాన్ విక్రమ్.. మరో రిస్క్ తీసుకుంటున్నాడా?

అపరిచితుడు, శివపుత్రుడు.. ఈ పేర్లు వినగానే తెలుగు ఆడియెన్స్‌కు గుర్తొచ్చేది చియాన్ విక్రమ్. క్యారెక్టర్ కోసం ప్రాణం పెట్టే నటుల్లో ఆయన ఫస్ట్ ప్లేస్ లో ఉంటారు. ఆ డెడికేషన్, ఆ మేకోవర్స్ ఇండియాలోనే చాలా తక్కువ మంది హీరోలు చేస్తూంటారు. అందుకే, విక్రమ్ సినిమా వస్తుందంటే, అది రొటీన్‌గా ఉండదని, ఏదో ఒక కొత్త పాయింట్‌తో వస్తుందని జనాలు నమ్ముతారు.కానీ, ఆ నమ్మకాన్ని నిలబెట్టే రేంజ్ సక్సెస్ విక్రమ్ చూసి చాలా కాలమైంది. ముఖ్యంగా అపరిచితుడు తర్వాత, తెలుగులో ఆ సినిమా క్రియేట్ చేసిన ఇంపాక్ట్‌ను మళ్లీ రీ క్రియేట్ చేయలేకపోయారు. మధ్యలో ఐ, కోబ్రా, మహాన్ లాంటి ఎన్నో ప్రయత్నాలు చేసినా, ఆ ల్యాండ్‌మార్క్ హిట్ మాత్రం పడలేదు. పొన్నియిన్ సెల్వన్ పెద్ద హిట్ అయినా, అది మణిరత్నం మార్క్ మల్టీ స్టారర్ గా నిలిచింది. సోలోగా విక్రమ్ విశ్వరూపం చూసి చాలా ఏళ్లయింది. ఈ మధ్య తంగలాన్, వీర ధీర శూరన్ లాంటి సినిమాలతో ఫ్యాన్స్‌ను పలకరించినా అవేమి బాక్సాఫీస్ వద్ద పెద్దగా మ్యాజిక్ చేసింది లేదు. ఇక ఆడియెన్స్ అతని నుంచి కోరుకుంటున్న ల్యాండ్ మార్క్ సినిమా అయితే ఇంతవరకు సెట్ కాలేదు. సాధారణంగా ఇలాంటి టైమ్‌లో, ఒక స్టార్ హీరో సాలిడ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలంటే, పేరున్న పెద్ద డైరెక్టర్‌తో, ఒక సేఫ్ ప్రాజెక్ట్‌తో వస్తాడు. కానీ, విక్రమ్ అలా ఆలోచించడం లేదు. ఆశ్చర్యకరంగా, చియాన్ 63 కోసం విక్రమ్ ఒక కొత్త డైరెక్టర్‌ను నమ్ముకున్నాడు.చాలా కాలం తర్వాత, విక్రమ్ ఒక డెబ్యూ డైరెక్టర్‌తో సినిమా చేస్తుండటం ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్. ఇంత పెద్ద రిస్క్ ఎందుకు తీసుకుంటున్నాడు? అంటే, ఒకే ఒక్క సమాధానం వినిపిస్తోంది.. ఆ కొత్త డైరెక్టర్ చెప్పిన స్క్రిప్ట్ విక్రమ్‌కు అంత బాగా నచ్చిందట. ఈ ఒక్క మూవ్ చాలు విక్రమ్ మెంటాలిటీ అర్థం చేసుకోవడానికి. ఆయనకు కావాల్సింది సక్సెస్ ఫుల్ డైరెక్టర్ కాదు, ఒక సాలిడ్ స్క్రిప్ట్. ఆయనకు కావాల్సింది సేఫ్ గేమ్ కాదు, నటుడిగా ఛాలెంజ్ చేసే ఒక కొత్త రోల్.

శివపుత్రుడు టైమ్‌లో ఆయన ఆకలి ఎలా ఉండేదో, ఇన్నేళ్ల తర్వాత, ఇన్ని ఫ్లాపుల తర్వాత కూడా ఆయన ఆకలి తగ్గలేదని అర్థమవుతుంది. ఈ రిస్క్ వర్కవుట్ అవ్వొచ్చు, అవ్వకపోవచ్చు. కానీ, విక్రమ్ మాత్రం తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడం ఆపడం లేదు. ఆ డెబ్యూ డైరెక్టర్ కనుక ఆ స్క్రిప్ట్‌ను పర్ఫెక్ట్‌గా డీల్ చేస్తే, తెలుగు ఆడియెన్స్ ఎప్పటినుంచో మిస్ అవుతున్న ఆ పాత అపరిచితుడుని మళ్లీ చూడొచ్చు.

హెబ్బా పటేల్ స్టైల్ అన్ని హైప్‌లకు విలువైనది





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com